ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

విశాఖపట్నం
జిల్లా వార్తలు
శుక్రవారం 7 మార్చి 2025

గీత కార్మికులకు మద్యం దుకాణాలు



- లాటరీలో 14 మందికి కేటాయించిన జేసీ
- నేటి నుంచి స్టాకు సరఫరా

- 8లో

కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ తీస్తున్న జేసీ మయూర్ అశోక్

సందడిగా ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ

- సీఎం, కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి, మాజీ ఉపరాష్ట్రపతి, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు

మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాసిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం ఉదయం గీతం విశ్వవిద్యాలయంలో ప్రముఖుల సమక్షంలో సందడిగా సాగింది. ఇంగ్లీష్ ప్రతిని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్, తెలుగు ప్రతిని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబునాయుడు హాజరయ్యారు. రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, విజయనగరం ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యేలు గంటా, విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు.



కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆమె చిత్రపటం బహూకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. చిత్రంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ మంత్రి, పుస్తక రచయిత దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఎంపీ ఎం.శ్రీభరత్ ఉన్నారు.

సీఎంకు వినతుల వెల్లువ

నిలిచిపోయిన ఇంటర్వ్యూలు నిర్వహించాలని అసిస్టెంట్ ఆచార్యుల స్క్రీనింగ్ పరీక్షల అర్హత అభ్యర్థులు

- నజీర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరిన ఉత్తరాంధ్ర మసీదుల కమిటీ సభ్యులు

విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఉదయం పలువురు జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వినతిపత్రాలు అందజేశారు.

మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాసిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం అర్ధరాత్రి సీఎం నగరానికి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేశారు. గురువారం ఉదయం పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు గీతం విశ్వవిద్యాలయానికి బయలుదేరబోతుండగా ఆయనకు పలువురు వినతిపత్రాలు అందజేసి, గోడు చెప్పుకున్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించి 2017లో నిలిచిపోయిన

... మిగతా 6వ పేజీలో



నజీర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరుతున్న ముస్లిం మత పెద్దలు

ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు

గోపాలపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగర పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పార్టీ నేతలు, అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. గురువారం మధ్యాహ్నం విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, ఆర్డీవో పి.శ్రీలేఖ, డీసీపీ మేరీ ప్రశాంతి, తదితరులు వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.



ముఖ్యమంత్రికి వీడ్కోలు పలుకుతున్న నేతలు, అధికారులు

మేయర్‌పై అవిశ్వాసం?

కూటమి వ్యూహరచన

కార్పొరేటర్ల సంతకాల ప్రారంభం

- ఈనెల 18వ తేదీ నాటికి నాలుగేళ్ల పదవీకాలం పూర్తి చేసుకోనున్న గొలగాని హరివెంకటకుమారి
- ఆ తర్వాత ఏ క్షణమైనా అవిశ్వాస తీర్మానంపై జిల్లా కలెక్టర్‌కు నోటీసు ఇచ్చే అవకాశం
- ప్రస్తుతం కూటమికి 66 మంది మద్దతు



గొలగాని హరివెంకట కుమారి

విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్ పీఠం దక్కించుకోవడానికి కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే ఏపీ మునిసిపల్ చట్టం ప్రకారం కనీసం నాలుగేళ్ల పదవీ కాలం పూర్తికావాలి. ఈనెల 18వ తేదీ నాటికి మేయర్‌గా గొలగాని హరివెంకటకుమారి పదవీకాలం నాలుగేళ్లు అవుతుంది. దీంతో ఆమెను మేయర్ పీఠం నుంచి దింపేసి, కూటమి సభ్యుడిని మేయర్ పీఠంపై కూర్చోబెట్టాలని భావిస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజా ప్రతినిధులు, నేతలు పలుమార్లు సమావేశమై చర్చించారు.

జీవీఎంసీ ఎన్నికల సమయంలో 97వ వార్డు నుంచి పోటీ చేసిన పీలా శ్రీనివాస్‌ను టీడీపీ తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించింది. ఇప్పుడు ఆయన్నే మేయర్ పీఠంపై కూర్చోబెట్టాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఈనెల 18 తర్వాత అవిశ్వాసం ప్రవేశపెట్టే అవకాశం ఉండడంతో కూటమి కార్పొరేటర్ల నుంచి సంతకాల సేకరణ మొదలెట్టారు. అవిశ్వాస తీర్మానం పెట్టాలని జిల్లా కలెక్టర్‌కు నోటీస్ ఇవ్వాలంటే జీవీఎంసీలో ఓటు హక్కు కలిగిన సభ్యుల్లో సగం మంది సంతకం చేయాల్సి ఉంటుంది. జీవీఎంసీలో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉండగా, ఇద్దరు ఎంపీలు, ఒక రాజ్యసభ సభ్యుడు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు మొత్తం కలిపి 111 మంది ఓటు హక్కు కలిగిన సభ్యులు ఉన్నారు. వీరిలో 50 శాతం అంటే 56 మంది నోటీస్‌పై సంతకాలు చేయాల్సి ఉంటుంది. టీడీపీ, జనసేన, బీజేపీకి ఇప్పటికే 56 మంది కార్పొరేటర్లు, ఒక ఎంపీ, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ మొత్తం 66 మంది సభ్యులు ఉన్నారు. అందువల్ల అవిశ్వాస నోటీస్ ఇవ్వడానికి ఎటువంటి ఇబ్బందీ ఉండదు. ఇక కలెక్టర్‌కు ఇచ్చిన నోటీసుపై సంతకాలు చేసిన సభ్యుల సంతకాలను ధ్రువీకరిస్తూ మరో ఇద్దరు సభ్యులు సంతకం చేయాల్సి ఉంటుంది. అవిశ్వాస తీర్మానంపై నోటీస్ జిల్లా కలెక్టర్‌కు అందిన తర్వాత అందులో ఉన్న సంతకాలను పరిశీలించాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్‌కు పంపిస్తారు. కమిషనర్ ఒక్కో సభ్యుడి సంతకాన్ని పరిశీలించిన తర్వాత జిల్లా

... మిగతా 6వ పేజీలో

స్టీల్‌ప్లాంటులో ప్రమాదం

- కాంట్రాక్టు కార్మికుడికి గాయాలు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):



గాయపడిన కాంట్రాక్టు కార్మికుడు ఆనందరెడ్డి

స్టీల్‌ప్లాంటు యుటిలిటీస్ విభాగంలో గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. విభాగంలోని ఏఎస్‌యూ-1 (ఎయిర్ సెపరేషన్ యూనిట్)లో ఆక్సిజన్ పంప్ ఒక్కసారిగా బరస్ట్ అయ్యింది. దాంతో ఆ ప్రదేశంలో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుడు సీహెచ్ ఆనందరెడ్డి (40)కి గాయాలయ్యాయి. అతడిని హుటాహుటిన ఉక్కు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆనందరెడ్డి శరీరం 40 శాతం మేర కాలిపోయినట్టు చెబుతున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర)	6.08
సహరి (శని)	4.54

కొండను చెరబట్టిన భూ రాబందు

సొంత జాగీరుగా మార్చుకున్న వైసీపీ ముఖ్యనేత కుమారుడు

- గజాల లెక్కన అమ్మకం
- తమ స్థలం లాక్కొన్నాడని కొందరు, తాము ఇళ్లు కట్టుకునేందుకు డబ్బులు గుంజారని మరికొందరు ఆరోపణ
- వెలుగుచూస్తున్న దయాల్‌నగర్ దాదా లీలలు
- అతని కనుసన్నల్లోనే రెవెన్యూ అధికారులు
- ఇప్పటికీ స్పందించని ఉన్నతాధికారులు
- మొక్కుబడిగా వీఆర్‌ఓను పంపి చేతులు దులిపేసుకున్న వైనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గాజువాక నియోజకవర్గంలో వైసీపీ ముఖ్య నేత కుమారుడి అక్రమాలు తవ్వేకొద్దీ వెలుగులోకి వస్తున్నాయి. 'దయాల్‌నగర్‌లో గూండారాజ్' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన నేపథ్యంలో అతని బాధితులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. కొండ తన సొంత జాగీరు అన్నట్టు పలువురికి విక్రయించడంతోపాటు ఆయా స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు తమ వద్ద లక్షల రూపాయలు గుంజేవారంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఇప్పటికీ అతని ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు.



దయాల్‌నగర్ కొండ

పెదగంట్యాడ మండలం దయాల్‌నగర్ కొండపై వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రహరీని ఆనుకుని సుమారు రెండు వేల గజాల స్థలం చాలా ఏళ్లుగా ఒకరి ఆధీనంలో ఉంది. ఆ స్థలం ప్రధాన రోడ్డును ఆనుకుని ఉండడంతో వైసీపీ నేత కుమారుడి కన్ను పడింది. రోడ్డు పక్కన సుమారు 500 గజాలు స్థలాన్ని తనకు ఇవ్వాలని, అందులో షాపింగ్ కాంప్లెక్స్ కట్టుకుంటానని బెదిరించి మరీ తీసుకున్నాన్నా. పైగా మిగిలిన స్థలాన్ని ఎవరికి అమ్ముకున్నాసరే అందులో నిర్మాణ పనులు కాంట్రాక్టు తన అనుచరుడైన మేస్త్రికి ఇవ్వాల్సిందేనని షరతు విధించారు. తప్పనిసరి పరిస్థితిలో అతను చెప్పినట్టే చేయాల్సి వచ్చిందని సంబంధిత స్థల యజమాని బంధువులు ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే స్వర్ణ నూకాంబిక ఆలయం వద్ద 120 గజాల స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయిస్తానని చెప్పి...రూ.16.5 లక్షలకు వేరొకరికి విక్రయించుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదే ఆలయ సమీపంలో ఒకరు తాము ఉంటున్న ఇంటిపై అదనపు అంతస్థు నిర్మిస్తుంటే జీవీఎంసీ, రెవెన్యూ అధికారులను పంపించి కూలగొట్టించి, తర్వాత భవన యజమానిని తన వద్దకు రప్పించుకుని రూ.ఐదు లక్షలు తీసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇలా...చెప్పుకుంటూ పోతే వందల ఉదంతాలు ఉన్నాయని దయాల్‌నగర్ నివాసితులు పేర్కొంటున్నారు.

రెవెన్యూ అధికారుల తీరుపై ఆరోపణలు

ప్రభుత్వ భూమిగా


... మిగతా 6వ పేజీలో

హక్కులపై మాట్లాడితే షోకాజ్ నోటీసులు!

- ఉక్కు యాజమాన్యం వింతవైఖరి
- నాడు జీతాల కోసం ధర్నా చేసిన ఉద్యోగులకు...
- నేడు సీఐటీయూ నాయకుడు అయోధ్యారామ్‌కు...



అయోధ్యారామ్



విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలపై ఎవరైనా మాట్లాడితే వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చి బెదిరిస్తోంది. బకాయి పడిన జీతాల గురించి ఉన్నతాధికారి కార్యాలయానికి వెళ్లి ప్రశ్నించిన ఉద్యోగులకు గతంలో నోటీసులు జారీచేసింది. ఇప్పుడు కాంట్రాక్ట్ కార్మికుల తగ్గింపు, హెచ్‌ఆర్‌ఏ కోత, విద్యుత్ చార్జీల పెంపు, వీఆర్‌ఎస్ వంటి అంశాలపై మీడియాతో మాట్లాడుతున్నారని, సంస్థకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ సీఐటీయూ గౌరవ అధ్యక్షులైన అయోధ్యారామ్‌కు గురువారం షోకాజ్ నోటీసు జారీచేసింది. ఉక్కు ఉద్యోగిగా పనిచేస్తూ సంస్థకు నష్టం జరిగేలా మాట్లాడుతున్నారని, దీనిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వారం రోజుల్లో చెప్పాలంటూ షోకాజ్ నోటీసు ఇచ్చింది.

పోరాడి తీరుతాం: అయోధ్యారామ్

షోకాజ్ నోటీసు అందుకున్న అయోధ్యారామ్ గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్లాంటును ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నాలు చేస్తుంటే దానిని అడ్డుకోవడానికి ఉద్యమం చేస్తున్నామన్నారు. ఇటీవల ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏ రూ.8 వేల నుంచి రూ.12 వేల

... మిగతా 6వ పేజీలో

బీచ్‌లో లైట్‌హౌస్‌ను కూల్చే కుట్ర!



విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణా బీచ్‌లో వీఎంఆర్‌డీఏ పార్కు వెనుక ఉన్న పాత లైట్ హౌస్‌ను కూల్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ లైట్ హౌస్ చాలా పురాతనమైనది. కొన్ని దశాబ్దాలుగా దీనిని ఉపయోగించడం లేదు. ఈ లైట్ హౌస్‌ను విశాఖపట్నం పోర్టు నిర్మించింది. దాని చుట్టూ ఉన్న భూమి సుమారు 78 సెంట్లు పోర్టు అప్పట్లో కొనుగోలు చేసింది. ఆ భూమి వృథాగా ఉందని దశాబ్దం క్రితం ఓ సంస్థకు లీజుకు ఇచ్చింది. అందులో నిబంధనలు ఏమిటో తెలియదు గానీ ఇప్పుడు ఆ సంస్థ అక్కడ కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలని యత్నిస్తోంది. దానికి లైట్ హౌస్ అడ్డంగా ఉండడంతో ఏదోవిధంగా కూల్చివేయాలని చూస్తున్నారు. వాస్తవానికి ఇది పురాతన కట్టడం కావడంతో వారసత్వ సంపదగా గుర్తించారు. దానిని కాపాడాల్సి ఉంది. కానీ వ్యాపార ప్రయోజనాల కోసం రాత్రికి రాత్రి ఏదోలా కూల్చేయాలని, పాతది కావడంతో కూలిపోయిందని ప్రచారం చేయాలని చూస్తున్నారు. తక్షణమే జిల్లా అధికారులు, పురావస్తు శాఖ అధికారులు మేల్కొని దీనిని పరిరక్షించాల్సి ఉంది.

విమ్స్‌లో సీబీఆర్‌ఎన్ మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్

సుమారు రూ.15 కోట్లతో ఏర్పాటు



- స్థలం కేటాయింపు...త్వరలో పనులు ప్రారంభం
- ప్రమాద, విపత్తు బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రమాద, విపత్తులతో పాటు వైరస్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశంలోని పది రాష్ట్రాలకు అత్యాధునిక వసతులు, నిపుణులతో కూడిన సెకండరీ లెవెల్ కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్ అండ్ న్యూక్లియర్ (సీబీఆర్‌ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్లను మంజూరుచేసింది. ఆ పదింటిలో మన రాష్ట్రం కూడా ఉంది. ఆ సెంటర్‌ను విమ్స్ ప్రాంగణంలో ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గత ఏడాది నవంబరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది.

కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.15 కోట్లతో సీబీఆర్‌ఎన్ మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేయబోతోంది. ఈ కేంద్రంలో పనిచేసేందుకు అవసరమైన నిపుణులను, సాంకేతిక సిబ్బందిని కేంద్ర ప్రభుత్వమే పంపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా కొంత మంది సిబ్బందిని నియమించుకోవాలని. వారికి కేంద్రం నుంచి వచ్చిన నిపుణులు మెరుగైన వైద్య సేవలను అందించే విధానాలపై శిక్షణ అందిస్తారు. జీతభత్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా

... మిగతా 6వ పేజీలో



భక్తులకు తీర్థ ప్రసాదాన్ని అందజేస్తున్న దృశ్యం

వారిజ ఆశ్రమాన్ని సందర్శించిన చినజీయరుస్వామి

భీమునిపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులోని వారిజ ఆశ్రమాన్ని గురువారం శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వేద, నేత్ర విద్యాలయ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం, భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆశ్రమ నిర్వాహకులు శ్రీకాంతాచార్యులు, సంతోషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నూకాంబిక విగ్రహ ప్రతిష్ఠ పూజలు

మధురవాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 7వ వార్డు పరిధి మిథిలాపురి వుడా కాలనీ సమీపం బింద్రానగర్‌లో నూతనంగా నిర్మించిన నూకాంబిక ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలను శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆయల కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయంలో నూకాంబికతో పాటు విజయ గణపతి, ఏకశిల నాగాభరణ శివలింగం, సుబ్రహ్మణ్యస్వామి, సంతాన నాగేంద్ర స్వామి విగ్రహాలను 10వ తేదీన ప్రతిష్ఠిస్తామన్నారు. ఇందులో భాగంగా దార్లపూడి సీతారామశర్మ ఆధ్వర్యంలో 12 మంది రుత్వికులు శుక్రవారం పూజాది కార్యక్రమాలకు శ్రీకారం చుడతారన్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన

సింహాచలం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకే ప్రశ్నార్థకంగా మారుతున్న నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై జేడీ ఫౌండేషన్ గోపాలపట్నం శాఖ సభ్యులు గురువారం సింహాచలం కొండదిగువ అప్పన్న స్వామి తొలిపావంచా వద్ద అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. 98వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, సచివాలయ శానిటరీ కార్యదర్శులు, ఫౌండేషన్ సభ్యులంతా ప్లాస్టిక్స్ వద్దు క్లాత్ సంచులే ముద్దంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం సింహాచలం ప్రధాన కూడలి వద్ద కొబ్బరికాయులు, పూజా సామగ్రి విక్రయాలు జరిపే చిరు వ్యాపారుల వద్దనున్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి వల్ల కలిగే అనర్థాలను కోరమాండల్ ఉద్యోగి జగన్నాథం యముడి వేషధారణలో భక్తులు, వ్యాపారులకు వివరించారు.

'స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి'



తగరపువలసలో స్కీం వర్కర్ల ర్యాలీ

తగరపువలస, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం వీఏఓలు తదితర స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ26 వేలు చెల్లించాలని కోరుతూ గురువారం తగరపువలసలో ర్యాలీ నిర్వహించారు. కనీస వేతనం చెల్లించడం ద్వారానే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ చిట్టివలసలోని సిటు కార్యాలయం వద్ద ప్రారంభమై కార్మికవాడ మీదుగా తగరపువలస కూడలికి చేరుకుంది. ఈ ర్యాలీకి మహిళా సంఘం నాయకురాలు మణి నాయకత్వం వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, మహిళా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. అంగన్వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీదేవి, కె.పద్మావతి, అప్పయ్యమ్మ, ఇతర సంఘాలకు చెందిన సూరమ్మ, అపర్ణ, కుంచమ్మ, సిటు నాయకులు ఆర్.నర్సింగరావు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేపై సిబ్బందికి వర్చువల్ శిక్షణ

ఆనందపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు మండల, గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో జానకి గురువారం పీ4 సర్వేపై వర్చువల్ శిక్షణ ఇచ్చారు. ఈ నెల 8 నుంచి 18 వరకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా పీ4 సర్వే నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యంతో ఈ సర్వేకు రూపకల్పన చేసినట్లు వివరించారు. పేదల అవసరాలు గుర్తించి వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ఈ సర్వే దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం లబ్ధి పొందుతున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టం చేశారు. సేకరించిన డేటా ఆధారంగా పక్కా ప్రణాళికల రూపకల్పనకు వీలవుతుందన్నారు. కుటుంబాల వివరాలు, వివిధ సామాజిక, ఆర్థిక పరిస్థితులపై కచ్చితమైన సమాచారాన్ని యాప్‌లో పొందుపరచాలన్నారు. అపోహలు తొలగించి సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. అన్ని శాఖల సమష్టి భాగస్వామ్యంతో సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయి అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సిబ్బందికి ఆమె సూచనలు, సలహాలు అందజేశారు.

చందనోత్సవం విజయవంతానికి కృషి చేద్దాం

» గత అనుభవాలను పాఠాలుగా చేసుకుని ముందుకెళదాం..

» సింహాచల దేవస్థానం ఈవో కె.సుబ్బారావు



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఈవో సుబ్బారావు

సింహాచలం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవాన్ని విజ.యవంతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని సింహాచల దేవస్థానం అధికారులకు కార్యనిర్వాహణాధికారి కె సుబ్బారావు దిశానిర్దేశం చేశారు. గత అనుభవాలను పాఠాలుగా చేసుకుని అందరూ ముందుకు సాగుదామన్నారు. వచ్చే నెల 30న జరగనున్న అప్పన్నస్వామి చందనోత్సవ కార్యక్రమ నిర్వహణపై గురువారం సింహగిరిపై వివిధ శాఖల అధికారులతో ఈవో ప్రత్యేకంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో చందనోత్సవం విజయానికి, ఇబ్బందులకు గల కారణాలను పలువురు అధికారులు ప్రస్తావించారు. వాటినన్నింటినీ ప్రణాళికాబద్ధంగా అధిగమించాలని, ఇందుకోసం ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అధికారులకు ఈవో సూచించారు. ప్రధానంగా క్యూ లైన్ల నిర్వహణ, ట్రాఫిక్ సమస్యలు, డిప్యూటేషన్ సిబ్బంది వినియోగం. వాళ్లకు వసతి, తదితర సౌకర్యాల కల్పన, సేవా సంఘాలకు అందజేయాల్సిన సహకారం, టికెట్ల డూప్లికేటింగ్‌ను అరికట్టడం, పోలీస్ బందోబస్తు, భక్తులకు తాగునీరు, ఆహార పదార్థాలను సమకూర్చడం, ప్రసాదాలు, నిత్యాన్న ప్రసాదం, తదితర అనేక అంశాలపై సమగ్రంగా చర్చించారు. భవిష్యత్తులో చేపట్టవలసిన చర్యలపై ప్రతిపాదనలను రూపొందించాలని సంబంధిత విభాగాధికారులకు ఈవో ఆదేశించారు. సమావేశంలో దేవస్థానం డిప్యూటీ ఈవో సింగం రాధ, ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కార్యనిర్వాహక ఇంజనీర్లు దండగణ శ్రీనివాసరాజు, బండారు రాంబాబు, పలు విభాగాల ఏఈవోలు, పర్యవేక్షణాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సింహాచలేశునికి స్వర్ణ పుష్పార్చన



స్వామివారికి హారతిస్తున్న అర్చకుడు

సింహాచలం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం స్వర్ణ పుష్పార్చనను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తి చేశాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి పూజాది కార్యక్రమాలను నిర్వహించి నారసింహ అష్టోత్తర శతనామావళిని పఠిస్తూ స్వర్ణ సంపెంగలతో అర్చనలు జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేసి అంతరాలయంలో స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు.

అప్పన్నను దర్శించుకున్న కేంద్ర కార్యదర్శి అజేయ్‌సేథ్



కప్పస్తంభం వద్ద అజేయ్‌సేథ్

సింహాద్రి అప్పన్న స్వామిని గురువారం కేంద్ర రెవెన్యూ విభాగం కార్యదర్శి అజేయ్ సేథ్ దర్శించుకున్నారు. ఆయనకు ఏఈవో ఎన్.ఆనందకుమార్ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్నాక అజేయ్‌సేథ్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనానంతరం ఆయనకు పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు సత్కరించి స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నడుపూరుకు చెందిన నాగోతి సత్యనారాయణ రూ.లక్షను విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ప్రజా సంబంధాల శాఖ విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందజేశారు. ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయ దర్శనం కల్పించి శేషవస్త్రాలతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

సింహాచలం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు పుష్కరిణీ సమీప 11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో అత్యవసర నిర్వహణ పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సింహాచలం, ప్రియా గార్డెన్స్, విజినిగిరిపాలెం, గాంధీనగర్, పాత అడవివరం, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పద్మనాభం: గంధవరం 11కేవీ ఫీడర్ పరిధిలో గృహ, వ్యవసాయ విద్యుత్ లైన్లను వేర్వేరుగా చేసే ఆర్‌డీఎస్‌ఎస్ పనులను చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మద్ది, విలాస్కాన్‌పాలెం, తునిపాలెం, బాందేవపురం, విజయరాంపురం, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

9 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

భీమునిపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వెంకటగిరి సాగర తిరుమల క్షేత్రంలో ఉన్న శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షులు గాడు అప్పలనాయుడు తెలిపారు. 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు జరిగే పూజాది కార్యక్రమాలతో బ్రహోత్సవాలకు శ్రీకారం చుడతామన్నారు. 10న శ్రీవారికి సుప్రభాత సేవ, ధ్వజారోహణం, గరుడ సేవ చేపట్టాక ప్రసాద వితరణ, సాయంత్రం శ్రీవారి కల్యాణం జరుగుతుందన్నారు. 11న శ్రీలక్ష్మీనారాయణ వ్రతం, సాయంత్రం విశేష హోమం,12న సుదర్శన హోమం, రాత్రి 7 గంటలకు దీపోత్సవం, 13న అష్టలక్ష్మీదేవికి సామూహిక కుంకుమార్చన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14న నవకలశ స్నపన, తిరుమంజనం, చక్రతీర్థోత్సవం, అన్నకూటోత్సవం, రాత్రికి శ్రీపుష్పయాగం, ఏకాంతసేవ, తీర్థ గోష్ఠి, పండిత సత్కారాలతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

కృష్ణంరాజుపేటలో 20 మంది రక్తదానం

భీమునిపట్నం (రూరల్) మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంరాజుపేటకు చెందిన ఫ్రెండ్స్ మెడికల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన శిబిరంలో 20 మంది యువకులు రక్తదానం చేశారు. 20 యూనిట్ల రక్తాన్ని సేకరించి రోటరీ బ్లడ్‌బ్యాంకుకు అందజేశారు. విశాఖపట్నం మెడికవర్ వైద్య బృందం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

మాస్టర్‌ప్లాన్ రహదారులు త్వరితగతిన పూర్తిచేయండి

ఇంజనీరింగ్ అధికారులకు వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఆదేశం



బక్కన్నపాలెం-రేవళ్లపాలెం రహదారిని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

కొమ్మాది/మధురవాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణానికి గల అడ్డంకులను తొలగించి త్వరితగతిన పూర్తిచేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. బక్కన్నపాలెం, రేవళ్లపాలెం రహదారిలో ఎప్పటి నుంచో నిలిచిపోయిన మాస్టర్‌ప్లాన్ రహదారిని గురువారం ఆయన పరిశీలించారు. రహదారి విస్తరణకు అవరోధంగా ఉన్న టీడీఆర్‌ల సమస్యను సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తే, పని పూర్తిచేయటానికి అవకాశం ఉంటుందని జీవీఎంసీ ప్రధాన పట్టణ ప్రణాళిక అధికారి హరిదాసుకు సూచించారు. జీవీఎంసీ జోన్-2 పరిధిలోని మధురవాడ పరిసరాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి వీఎమ్ఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులతో కలసి 7వ వార్డు వుడాకాలనీని సందర్శించారు. మిథిలాపురి వుడాకాలనీ నుంచి వాంబే కాలనీకి వెళ్లే డబుల్ రోడ్డును వారు పరిశీలించారు. వుడా రోడ్డులో బాక్స్ క్రికెట్, అవుట్‌డోర్ క్రీడాప్రాంగణం నిర్మాణానికి స్థలాన్ని చూశారు. జాతీయ రహదారి నుంచి నగరంపాలెం రోడ్డు మీదుగా ఐటీ కంపెనీలకు వెళ్లే రహదారిని కూడా పరిశీలించారు. ఈ రహదారులపై స్థానికుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అర్బన్ ప్లానర్ శిల్ప, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ భవానీశంకర్, ఎల్ఏఓ వేణుగోపాల్, ప్లానింగ్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



చంద్రంపాలెం పాఠశాలలో అవగాహన సదస్సులో పాల్గొన్న సివిల్ జడ్జి శేషమ్మ, ఇతర అధికారులు

కొమ్మాది, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): యువతులు, బాలికలపై అకృత్యాలు పెరిగిపోతున్న నేటి రోజుల్లో ప్రతి విద్యార్థిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పోక్సో చట్టంపై అవగాహన ఉండాలని న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. గురువారం చంద్రంపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అతిపెద్ద పాఠశాల కావడంతో ప్రతి విద్యార్థినిని పర్యవేక్షించటం కష్టమన్న న్యాయమూర్తి ప్రతి విద్యార్థిని తమ హక్కులు, బాధ్యతలు, పరిధులు తెలుసుకుని ప్రవర్తించాలని సూచించారు. మంచి, చెడు స్పర్శ (గుడ్ టచ్, బ్యాడ్ టచ్)లపై అవగాహన ఉండాలన్నారు. ఎవరైనా తప్పుగా ప్రవర్తించినప్పుడు తప్పనిసరిగా ఫిర్యాదు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జె.చంద్రశేఖర్, జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ జ్యోతి, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా అనంత పద్మనాభుని రాట మహోత్సవం



అనంతుని పెళ్లిరాట వేస్తున్న దృశ్యం

పద్మనాభం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పద్మనాభంలో అనంతపద్మనాభుని కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన స్వామివారి పెళ్లిరాట మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో భాగంగా ముందుగా ప్రార్థనా సూక్తంతో ప్రారంభించారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మేదినీ ఆరాధన చేసి స్వామివారి పెళ్లిరాటను వేదోక్తంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా తయారు చేయించిన రోలులో మహిళలు పసుపు దంచి అనంతుని కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ నానాజీబాబు, అర్చకులు సీతారామాంజనేయస్వామి, వెంకటాచార్యులు, పవన్, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె.నగేష్‌కుమార్, సర్పంచి టి.పాప, పద్దు దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, ఎర్నాయుడు దంపతులు, ఉత్సవ కమిటీ సభ్యులు పైడిరాజు, నర్సింగరావు, బుగత రాము, ఎస్.అప్పలనాయుడు, పైడినాయుడు, సన్నిబాబు, నర్సింహనాయుడు, బీజేపీ నాయకులు శ్రీను, మహేష్ పాల్గొన్నారు.

సనాతన ధర్మానికి పుట్టినిల్లు భారతదేశం: కళాకాంతప్రభు



ఇస్కాన్‌లో ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న కళాకాంతప్రభు

సాగర్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశం పుణ్యభూమి.. సనాతన ధర్మానికి పుట్టినిల్లు.. మీరంతా భారతదేశంలో పుట్టినందుకు ఎంతో అదృష్టవంతులని శ్రీల ప్రభుపాదుల శిష్యుడు కళాకాంత ప్రభు అన్నారు. సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా గురువారం ఆయన విశాఖ చేరుకున్నారు. ఇస్కాన్ సాగర్‌నగర్ మందిరంలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, శ్రీమద్భాగవతం..లాంటివన్నీ భారతదేశంలో ఉద్భవించినవేనన్నారు. ప్రపంచానికి భారతదేశం మార్గనిర్దేశం చేస్తుందని అభివర్ణించారు. సనాతన ధర్మాన్ని ప్రచారం చేయడంలో ఇస్కాన్ విశేష కృషి చేస్తుందన్నారు. హరినామ సంకీర్తన, సనాతన ధర్మాన్ని, భగవంతుని విశిష్టతను ప్రచారం చేయడంలో యువత ముందుకు రావాలని కోరారు. శ్రీకృష్ణుని బాల్య లీలల నుంచి నేర్చుకోవలసిన గుణపాఠాలు, యుద్ధ సమయంలో అర్జునుడికి చేసిన గీతోపదేశం ద్వారా మనిషి ఎలా ప్రవర్తించి భగవంతుని చేరుకోవాలో ఆయన విశదీకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ విశాఖపట్నం అధ్యక్షుడు సాంబదాసు, మాతాజీ నితాయిసేవని, భక్తులు పాల్గొన్నారు.

సీఎంకు వినతుల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

ఇంటర్వ్యూలు నిర్వహించాలని అసిస్టెంట్ ఆచార్యుల స్ర్కీనింగ్ పరీక్షల అర్హత అభ్యర్థులు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 24 వేల మంది పరీక్ష రాయగా, ఇంటర్వ్యూలకు 3,436 మంది అర్హత సాధించారన్నారు. రాత పరీక్షలో విజయం సాధించిన తమకు ఇంటర్వ్యూలు నిర్వహించి తగిన న్యాయం చేయాలని కోరారు. అలాగే 2020 ఫిబ్రవరిలో విపక్ష నేతగా ఉన్న తమ (చంద్రబాబునాయుడు)పై విశాఖ ఎయిర్‌పోర్టులో దాడి చేసిన వైసీపీ నేతలు, కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్టు పోలీసులు సుమోటోగా కేసు నమోదుచేసినా, ఇంతవరకూ దర్యాప్తు చేయలేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. నగరానికి చెందిన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని ఉత్తరాంధ్ర మసీదుల కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. కాగా 55వ వార్డు పరిధి రెడ్డికంచరపాలెంలో ప్రభుత్వం ఇచ్చిన 60 గజాల స్థలంలో పైఅంతస్థు నిర్మాణానికి సచివాలయ సిబ్బంది అడ్డుపడుతున్నారని, లంచం ఇవ్వాలని పదేపదే వేధిస్తున్నారని షైలపల్లి హరిబాబు అనే వ్యక్తి సీఎంకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రిని ఎంపీ ఎం.శ్రీభరత్, పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, రాష్ట్ర హౌసింగ్, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, గవర, వెలమ కార్పొరేషన్‌ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, పార్లమెంటు పార్టీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు వెల్లంకి భరత్, సర్వసిద్ధి అనంతలక్ష్మి, తోట రత్నం, ముత్యాలనాయుడు, చిన రెహమాన్, తదితరులు కలిశారు.

హక్కులపై మాట్లాడితే షోకాజ్ నోటీసులు!

... 5వ పేజీ తరువాయి

వరకు కోత పెట్టారని, అలాగే విద్యుత్ చార్జీలు పెంచేశారని, జీతాలు సకాలంలో ఇవ్వడం లేదని, కాంట్రాక్టు కార్మికులను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని వీటిపై మాట్లాడితే సంస్థకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నామని చెబుతున్నారని, దీనిని తాము ఖండిస్తున్నామన్నారు. ప్లాంటును రక్షించుకోవడానికి, కార్మికుల హక్కుల కోసం యూనియన్ తరపున పోరాటం చేస్తున్నామని, యాజమాన్యం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూస్తామన్నారు. షోకాజ్ నోటీసులకు బెదిరేది లేదని, ఇదే విధానంతో, కార్మికుల తరపున గొంతు వినిపిస్తామని స్పష్టం చేశారు.

కొండను చెరబట్టిన భూ రాబందు

... 5వ పేజీ తరువాయి

రెవెన్యూ రికార్డుల్లో ఉన్న దయాల్‌నగర్ కొండపై జాగాను వందేసి గజాలుగా విభజించి వైసీపీ ముఖ్య నేత కుమారుడు తన సొంత ఆస్తిలా విక్రయిస్తుంటే అడ్డుకుని క్రిమినల్ కేసులు పెట్టాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కూడా అతని దందాకు అడ్డుకట్ట వేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పైగా అతను చెప్పినట్టు రెవెన్యూ, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నడుచుకుంటుండడం చూస్తే మామూళ్లు అందుతున్నాయనే భావన కలుగుతోందని స్థానికులు అంటున్నారు. దయాల్‌నగర్‌లో భూకబ్జాలు, అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన తర్వాత కూడా రెవెన్యూ శాఖ అధికారులు కదలలేదు. ఆ ప్రాంత వీఆర్‌ఓ మాత్రం గురువారం ఉదయం కొండపైకి వెళ్లి 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంలోని ఫొటోలు గల ఇళ్లు చూసి తిరిగి వెళ్లిపోయారు.

మేయర్‌పై అవిశ్వాసం?

... 5వ పేజీ తరువాయి

కలెక్టర్‌కు నివేదిక పంపిస్తారు. తర్వాత జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం కోసం కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేస్తారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా సభకు హాజరైనవారి వారిలో మెజారిటీ సభ్యులు చేతులెత్తితే అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు అవుతుంది. అప్పుడు మేయర్ స్థానంలో ఉన్నవారు పదవిని వీడాల్సి ఉంటుంది. ఇదే విషయమై చర్చించేందుకు కూటమి నేతలు అమరావతి వెళ్లి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లను కలిసినట్టు ప్రచారం జరుగుతోంది. బడ్జెట్ సమావేశం తర్వాత దీనికి సంబంధించిన ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉందని కూటమి నేతలు చెబుతున్నారు.

విమ్స్‌లో సీబీఆర్ఎన్ మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్

... 5వ పేజీ తరువాయి

చెల్లించనున్నాయి. మూడేళ్లపాటు నిర్వహణకు అవసరమైన సహకారాన్ని కేంద్రం అందిస్తుంది. అనంతరం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే ఈ సెంటర్ బాధ్యతను చూసుకోవాల్సి ఉంటుంది.

అత్యాధునిక పరికరాలతో వైద్య సేవలు

ఫార్మా, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాల్లో జరిగితే ప్రస్తుతం క్షతగాత్రులను కేజీహెచ్‌కు పంపుతున్నారు. కొన్నిసార్లు ప్రభుత్వ ఆదేశాలతో ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తున్నారు. అయితే, అత్యాధునిక పరికరాలు, నిపుణులు లేకపోవడం ఒక్కోసారి ఇబ్బందిగా మారుతుంది. అటువంటి సందర్భాల్లో ఈ సీబీఆర్ఎన్ మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్‌లో మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. అదేవిధంగా గ్యాస్ పేలుడు, కొవిడ్ తరహా వైరస్ బాధితులకు బయోలాజికల్ విభాగానికి చెందిన నిపుణులు, పరిశ్రమల్లో రేడియేషన్‌కు సంబంధించిన పదార్థాల పేలుడు జరిగినప్పుడు రేడియోలాజికల్ విభాగ సిబ్బంది సేవలు అందించనున్నారు. పరిశ్రమలు, నేవీ, ఆర్మీ వద్ద న్యూక్లియర్ పదార్థాలు ఉంటాయి. పొరపాటున పేలుడు జరిగినా, లీక్ అయినా బాధితులకు తక్షణ వైద్య సాయం అందించేందుకు అనుగుణంగా ప్రత్యేకంగా న్యూక్లియర్ బ్లాక్‌ను ఏర్పాటుచేస్తారని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించామని, కొద్దిరోజుల్లో నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి కూడా మెరుగైన వైద్య సేవలను అందించవచ్చునన్నారు.



సమ్మేళనంలో భాగంగా సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాధాన్యం

ఇన్ఫోసిస్ విశాఖ అధిపతి నర్రా సురేశ్

తగరపువలస, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు రానున్న కాలంలో ఎంతో ప్రాధాన్యం పెరుగుతుందని, భవిష్యత్తు అంతా దీనిపైనే ఆధారపడి ఉంటుందని విశాఖపట్నం ఇన్ఫోసిస్ అధిపతి నర్రా సురేశ్ అన్నారు. సంగివలస ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో గురువారం జరిగిన జాతీయ స్థాయి సాంకేతిక సమ్మేళనాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధాకు పదును పెట్టే పనులు చాలా జరుగుతున్నాయని, దీని ద్వారా ఎన్నో అద్భుతాలు ఆవిష్కృతమవుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరామకృష్ణ మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నిపుణులను తయారుచేసేలా వివిధ రకాల సాంకేతిక సదస్సులను తమ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈసీఈ విభాగాధిపతి బండి జగదీశ్ మాట్లాడుతూ పలు కళాశాలల విద్యార్థులకు పేపర్ ప్రజంటేషన్, ఎలక్ట్రానిక్ సర్క్యూట్ రూపకల్పన, సాంకేతిక క్విజ్, పోస్టర్ తయారీ వంటి ఎనిమిది రకాల అంశాలపై పోటీలు నిర్వహించామన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమ్మేళనంలో అకడమిక్ హెడ్ రాజ్యలక్ష్మి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా సావనీర్‌ను ఆవిష్కరించారు

వైభవంగా ఎల్లమ్మతల్లి తొలేళ్ల ఉత్సవం

భీమునిపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి రెల్లివీధిలో కొలువుదీరిన ఎల్లమ్మతల్లి జాతరలో భాగంగా గురువారం రాత్రి తొలేళ్ల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పులి వేషాలు, నేల వేషాలు, బాణసంచా కాల్పులతో ఆలయం నుంచి తొలేళ్ల ఉత్సవ ఊరేగింపు చిన్నబజారు, పెద్దబజారు మీదుగా సాగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వి.శేఖర్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలకు భక్తులకు అవకాశం కల్పిస్తామన్నారు. శుక్రవారం సాయంత్రం అనుపోత్సవాన్ని జరుపుతామన్నారు.

క్వారీని పరిశీలించిన రెవెన్యూ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భీమునిపట్నం (రూరల్) మార్చి 6 (ఆంధ్రజ్యోతి): 'క్వారీ తవ్వకాల్లో నిబంధనలే బేఖాతరు' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి భీమిలి రెవెన్యూ అధికారులు స్పందించి గురువారం క్వారీని పరిశీలించారు. రామునాయుడుపేట ప్రాంతంలో ఉన్న క్వారీని వీఆర్వో పరిశీలించి నివేదిక అందించినట్టు తహశీల్దార్ పి.రామారావు తెలిపారు. తమ పరిధిలో అన్నీ నిబంధనల మేరకు నిర్వహిస్తున్నామన్నారు. ఒక క్వారీకి 2032 వరకు లీజు గడువు ఉందని పేర్కొన్నారు. లీజుకు తీసుకున్నవారు నిబంధనలు పాటించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఘనంగా యల్లమాంబ తొలేళ్లు



పూజల్లో పాల్గొన్న గ్రామస్థులు

వెంకోజీపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పాతవెంకోజీపాలెం యల్లమాంబనగర్‌లోని యల్లమాంబ అమ్మవారి తొల్లేళ ఉత్సవం గురువారం ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం అమ్మవారిని పురవీధులలో ఊరేగిస్తామన్నారు. వారణాసి విశాలాక్షి, కాళ్ల కుమార్, కాళ్ల అప్పలరాజు, రాజారావు, శ్యామ్‌సుందరరావు, నాగేశ్వరరావు, నాగరాజు, రఘు, జగదీష్, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

భవిత సెంటర్‌కు వితరణ

ఆరిలోవ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తోటగరువు ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత సెంటర్‌కు సింహాచలానికి చెందిన వంటాకులు శ్యామల, రమేష్ వాటర్ ఫిల్టర్‌ని వితరణగా అందించారు. తన తండ్రి సిరిపురపు ఉమామహేశ్వరావు వర్ధంతి సందర్భంగా అందిచారు. పాఠశాల ఉపాధ్యాయులు, భవిత టీచర్స్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

మద్దిలపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ) ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశ్ సూచించారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం డీఎస్ఎన్ఎల్‌యూను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఉపకులపతి మాట్లాడారు.

జీవన భద్రతపై శిక్షణ

పెదవాల్తేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో జీవన భద్రతపై పెదజాలారిపేట కమ్యూనిటీహాల్‌లో గురువారం శిక్షణ జరిగింది. మత్స్యకార శాఖ సహకారంతో ఎన్ఎఫ్‌డీబీ పీఎంఎంఎస్‌వై కింద సముద్రంలో జీవన భద్రతపై ఔట్‌రీచ్ శిక్షణను సీఐఎఫ్ఎన్ఈటీ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎం.విజయకృష్ణ, డాక్టర్ మహదేవ్ రామకొకనే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఇన్‌స్ట్రక్టర్ (ఎఫ్‌టి) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అభిషేక్, దీపక్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం:** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్:** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం:** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 14, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 44, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 32 దొండకాయలు 38, బంగాళదుంపలు 15, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 56, అల్లం 50, బరబాటి 32, ముల్లంగి 2, నిమ్మకాయలు (కిలో) 95, బద్దచిక్కుడు 44, దోస కాయలు 28, వెల్లుల్లి 115, కొబ్బరికాయ 25, బీన్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 40, పొట్లకాయ 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 56, గోరుచిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

రాష్ట్రాన్ని నాశనం చేసిన ఘనత జగన్‌దే

» జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జనసేన కార్పొరేటర్లు నిరసన



నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని జనసేన కార్పొరేటర్లు, వీర మహిళల నిరసన

సిరిపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని ఐదేళ్ల పాటు నాశనం చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జనసేన కార్పొరేటర్లు ఎద్దేశా చేశారు. ఆయన పాలనలో పడిన ఇబ్బందులతో ప్రజలు వైసీపీకి ఘోర అవమానం చేశారన్నారు. అయినప్పటికీ జగన్‌లో మార్పు కన్పించడం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై జగన్ వ్యాఖ్యలకు నిరసనగా గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ పేరు ఎత్తే కనీస అర్హత జగన్‌కు లేదన్నారు. కార్పొరేటర్ అంటే జగన్‌కు ఎంత చులకనో అర్థమవుతోందన్నారు. దీనివల్ల తన పార్టీ కార్పొరేటర్‌లకు ఏ స్థాయి గౌరవం ఇస్తారో అందరికీ తెలిసిందన్నారు. పవన్‌కు జగన్‌లా లక్ష కోట్లు అవినీతి చేయడం రాదని, చిన్నాన్నను చంపడం తెలియదని, దళితులను అవమానించిన వారికి సింహాసనం ఇవ్వడం నేర్చుకోలేదని వీటిలో జగన్ కంటే పవన్‌కల్యాణ్ తక్కువేనన్నారు. సొంత తల్లి, చెల్లిపై కేసు పెట్టిన దుర్మార్గుడు జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. సనాతన ధర్మంలోని వ్యక్తిని దూషించడం నేరమన్నారు. పవన్‌కల్యాణ్ 100 శాతం సీట్లు గెలిచిన ఘనత సొంతం చేసుకున్నారన్నారు. మారుమూల గ్రామాలకు రోడ్లు వేశారని, పంచాయతీలకు ఊపిరి పోశారన్నారు. ఇప్పటికే లెవన్ మోహన్‌రెడ్డిగా పేరు తెచ్చుకున్న జగన్‌మోహన్‌రెడ్డి ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలని, లేదంటే జనసైనికుల తడాఖా చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్లు పీతల మూర్తియాదవ్, భీశెట్టి వసంత, దల్లి గోవింద్‌రెడ్డి, ఉషశ్రీ, కందుల నాగరాజు, వీర మహిళలు పాల్గొన్నారు.

'హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి'



ధర్నాలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మన్మథరావు

సిరిపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టేట్ సివిల్ సప్లైస్ హమాలీ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సరఫరాల వ్యవస్థ ప్రారంభం నుంచి వీరు పనిచేస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. విధి నిర్వహణలో అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, కనీసం వైద్యం కూడా లభించడం లేదని ఈఎస్ఐ సదుపాయం తక్షణం కల్పించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన హమాలీ కుటుంబాలకు పీఎఫ్ ద్వారా పెన్షన్ సౌకర్యాన్ని వర్తింపజేయాలని, కార్మికులందరికీ పీఎఫ్ సొమ్మును తక్షణమే అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, పి.రమణ, కాసుబాబు, గురుమూర్తి, హమాలీలు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా సాగర్‌నగర్ బీచ్



ప్రతిపాదనలను గంటాకు వివరిస్తున్న అధికారులు

విశాఖపట్నం, మార్చి6 (ఆంధ్రజ్యోతి): నగరవాసులతో పాటు విశాఖ వచ్చే పర్యాటకులను దృష్టిలో పెట్టుకుని బీచ్ ప్రాజెక్టులు డిజైన్ చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. సాగర్‌నగర్ బీచ్ సుందరీకరణ, సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లో ఈటర్స్‌జోన్ ప్రతిపాదనలు జీవీఎంసీ అధికారులు గురువారం గంటాకు వివరించారు. రూ.15.65 కోట్లతో సాగర్‌నగర్‌బీచ్‌లో 800 మీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేపట్టనున్నామన్నారు. సాగర్‌నగర్, రుషికొండలలో ఒక్కోదానికి రెండు కోట్ల రూపాయలతో ఈటర్స్ జోన్‌లు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ నిధుల్లో ఒక్కోదానికి రూ.50లక్షలు చొప్పున కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయనుందని పేర్కొన్నారు. ఇస్కాన్ టెంపుల్ ఎదురుగా రూ.9 కోట్లతో 20 ఎకరాల్లో ప్రతిపాదిత బీచ్ సుందరీకరణ పనులకు తుది ఆమోదం రావాల్సి ఉందని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యాటకులను ఆకట్టుకునేలా, విశాఖ ప్రతిష్ఠను ఇనుమడింప చేసేలా సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. ఈటర్స్ జోన్ ప్రతిపాదిత ప్రాంతాలను స్వయంగా సందర్శిస్తామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతిరాజు పాల్గొన్నారు.

భారతీయ మహిళలు అత్యంత ధైర్యవంతులు

» జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి



విజయభారతిని సత్కరిస్తున్న మహిళా అధ్యాపకులు

వెంకోజీపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ మహిళలు అత్యంత ధైర్యవంతులని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు ఎస్.విజయభారతి అన్నారు. గురువారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో దుర్గాబాయి దేశముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, ఏబీఆర్ఎస్ఎం అండ్ లేడీ టీచర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2025 వర్క్ షాప్ ఆక్సిలరేట్ యాక్షన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ విద్యతో సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు. సంస్కారవంతమైన యువత తయారు కావాలంటే తల్లిదండ్రులే కీలకమని చెప్పారు. మన నైపుణ్యాలను, సామర్థ్యాలను తెలుసుకుని వినియోగించుకుంటే సాధికారిత సాకారమవుతుందన్నారు. విద్య ఇచ్చే విలువ అపారమని గుర్తించాలన్నారు. సమాజం కోసం, దేశం కోసం భావనతో యువత ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం స్త్రీ పురుషులకు సమాన హక్కులను ఇచ్చిందని, ఇది తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. భారతీయ చట్టాలు సమాన వేతనం, సమాన పని పరిస్థితులు, గృహహింస నియంత్రణ, పనిచేసే ప్రాంతంలో వేధింపుల నియంత్రణ తదితర చట్టాలను కల్పించిన విధానాన్ని వివరించారు. హక్కులతో పాటు ప్రతి వ్యక్తి తన బాధ్యతలను సైతం తెలుసుకోవాలని సూచించారు. యువత తమలోని మేధోశక్తిని వృద్ధి చేసుకునే దిశగా నిరంతరం పనిచేయాలన్నారు. మానవ హక్కుల పరిరక్షకులుగా యువతరం నిలవాలన్నారు. వివేకానందుడు కలలుగన్న విధంగా యువతరం ఉజ్వల తారలుగా మారాలని తమ ఆశయాలను సాకారం చేసుకోవాలని సూచించారు. మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎ.పల్లవి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులను, యువతను భాగస్వాములను చేస్తూ విభిన్న క్రీడా, సాంస్కృతిక, మేధో కార్యక్రమాలను నిర్వహిస్తున్న విధానాన్ని సభకు వివరించారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శిరీషరాణి మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పోషకాహారం తీసుకోవడం శారీరక వ్యాయామం చేయడం తమ దినచర్యల్లో భాగం కావాలని చెప్పారు. మానసిక, శారీరక ఆరోగ్యం సమతుల్యత దెబ్బతినకుండా చూసుకోవాలని అన్నారు. ఏయూ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగరాజకుమారి మాట్లాడుతూ మహిళా విద్య సామాజిక మార్పునకు కారణంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మశ్రీ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం



పాల్గొన్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఎంవీపీ కాలనీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శివాజీ పార్కు గొడుగు వాకర్స్ అసోసియేషన్ మూడో వార్షికోత్సవాన్ని గురువారం పార్కులో ఘనంగా నిర్వహించారు. వాకర్స్ అంతర్జాతీయ అధ్యక్షురాలు ఎం. ప్రభావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఆరోగ్యానికి నడక ఎంతో అవసరమని అన్నారు. వ్యాయామం వల్ల మానసిక ఆనందం, ప్రశాంతత లభిస్తుందన్నారు. జిల్లా 101 గవర్నర్ కె. ద్వారకానాథ్, ప్రొఫెసర్ వి ఎస్ ఆర్ కే ప్రసాద్, శోభ, ఎలక్ట్ గవర్నర్ మహేష్, క్లబ్ అధ్యక్షులు కే శివరామకృష్ణ, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. సభ్యులు నందకుమార్, జాలీ వాకర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ 'మహిళల హక్కులకు మద్దతు పలకండి' అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీపీ డిగ్రీ కళాశాలలో గురువారం ఆవిష్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, కళాశాల ప్రిన్సిపాల్ కె.జగదీశ్వరరావు డాక్టర్ అప్పారావు, మహాలక్ష్మి, దీపిక, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో కానిస్టేబుల్ మృతి



విజయరామ్‌సింగ్ (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న చత్రియ విజయరామ్‌సింగ్(38) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందారు. రెండ్రోజుల క్రితం అనారోగ్యంతో రాజమహేంద్రవరంలోని కిమ్స్ ఆస్పత్రిలో చేరిన ఆయన గురువారం మృతిచెందారు. రెండున్నరేళ్లుగా పాయకరావుపేటలో పనిచేస్తున్న రామ్‌సింగ్‌కి భార్య, ఇద్దరు పిల్లలుండగా, ఆయన స్వస్థలం విశాఖపట్నంలోని పైనాపిల్ కాలనీ. మృతదేహాన్ని అక్కడికి తరలించగా సీఐ జి.అప్పన్న, సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి పార్థివదేహం వద్ద నివాళి అర్పించారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఫోన్లో విజయరామ్‌సింగ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయంగా ప్రభుత్వం అందజేసిన లక్ష రూపాయలను మృతుడి కుటుంబ సభ్యులకు సీఐ జి.అప్పన్న అందజేశారు. విజయరామ్‌సింగ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

8న హీరోయిన్ తమన్నాతో సంగీత కార్యక్రమం

రామ్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న సినీ హీరోయిన్ తమన్నా భాటియాతో సంగీత కార్యక్రమాన్ని నిర్వ హించనున్నట్టు రిత్విజ్ సంస్థ ప్రతినిధి ప్రతినిధి జెమ్స్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వన్ అండ్ ఓన్లీ మ్యూజికల్ ఫ్యాషన్ షో హోటల్ రాడిసన్ బ్లూలో నిర్వ హిస్తున్నా మని వివరించారు. ప్రముఖ ఫ్యాషన్ డిజై నర్ అక్షిత్ బన్సాల్ హీరోయిన్ తమన్నా భాటియాలు హాజరవుతారన్నారు.

ఏయూ విద్యార్థినుల హాస్టల్ నిర్వహణ భేష్

» ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి



హాస్టల్ మెస్ తనిఖీ చేస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి

వెంకోజీపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఏయూ విద్యార్థినుల హాస్టల్ నిర్వహణ ఆదర్శంగా నిలుస్తుందని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు ఎస్.విజయభారతి అన్నారు. గురువారం ఆమె ఆకస్మికంగా ఏయూ విద్యార్థుల నాగార్జున ప్రసతిగృహం సందర్శించారు. విద్యార్థుల మెస్, వంటశాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు ఎంతో పరిశుభ్రంగా ఉన్నాయని, ఆహారం రుచికరంగా ఉందని ప్రశంసించారు. తాను తరచూ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో విద్యార్థులు ఉండే హాస్టల్స్‌ను సందర్శించడం జరుగుతుందని, ఇటువంటి పరిశుభ్రమైన పరిసరాలు, రుచికరమైన ఆహారం ఎక్కడ తాను చూడలేదన్నారు. ఇకపై తాను సందర్శించే హాస్టల్స్‌కు ఏయూ ను ఒక మోడల్‌గా చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ ఆచార్య ఏ.పల్లవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్‌తో విజయభారతి భేటీ అయ్యారు. ఏయూ విశిష్టతను వీసీ వివరించారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఏయూ ఆచార్యులతో తనకున్న అనుబంధాన్ని, సాహచర్యాన్ని విజయభారతి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతరం వర్సిటీ తరపున విజయభారతిని సత్కరించి జ్ఞాపికను అందించారు.

వీసీని కలిసిన ప్రముఖులు

ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌ను ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్న గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏయూని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం సలహాదారుగా పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ వీసీతో భేటీ అయ్యారు.

స్టార్టప్ కేంద్రాన్ని సందర్శించిన వీసీ

స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రాన్ని వీసీ ఆచార్య జి.పి. రాజశేఖర్ గురువారం సందర్శించారు. స్టార్టప్ సంస్థల పనితీరు, ప్రగతి పరిశీలించారు. ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరరావు సంస్థల ప్రగతి, వచ్చిన ప్రతిపాదనలు, అనుమతులు, సాధించిన మైలురాళ్లు వివరించారు. అనంతరం నాస్కామ్ సౌజన్యంతో ఏయూలో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను పరిశీలించి ప్రతినిధులతో వీసీ మాట్లాడారు. ఎస్‌టీపీఐ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సందర్శించి శిక్షణ కార్యక్రమాలపై ఆరా తీశారు. ఉపకరణాలు పరిశీలించారు. అనంతరం సీ4ఐ4 ల్యాబొరేటరీపై రివ్యూ చేశారు. నాలుగు వారాల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఎలిమెంట్ భవనంలో ఫుడ్, బయో సైన్స్ ల్యాబొరేటరీకి వచ్చిన పరికరాలను, వెంటనే అమర్చాలని సూచించారు. ఏప్రిల్ నెలాఖరుకు అందుబాటులోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ప్రణాళికా విభాగం పనితీరు మెరుగుపరచుకోవాలి



మాట్లాడుతున్న వీఎంఆర్‌డీ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాఖపట్నం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ ప్రణాళికా విభాగం పనితీరు మెరుగు పరచుకోవాలని సంస్థ చైర్మన్ వి.ప్రణవ్ గోపాల్ సూచించారు. వీఎంఆర్డీఏ కార్యాలయంలో గురువారం ఆయన సంస్థ విభాగాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. పూర్తైన పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరం మేరకు ఎంపీల, ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రతివారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీ కృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, అర్బన్‌ప్లానర్ శిల్పా, ఎస్టేట్ అధికారి దయానిధి, గణాంకాధికారి హరిప్రసాద్, డివిజనల్ అటవీశాఖ అధికారి శివానీ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను నియంత్రించాలి



నిరసన తెలుపుతున్న మహిళా చేతన సభ్యులు

సిరిపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న దాడులు, హింస, అణచివేతకు వ్యతిరేకంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ కోరారు. గురువారం జీవీ ఎంసీ గాంధీ విగ్రహం ఎదుట స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. దిశ చట్టాన్ని అమలు చేయాలని ప్లకార్డులను ప్రదర్శించారు. మహిళలపై వేధింపులు, దాడులు, అత్యాచారాలు ఎక్కువయ్యాయని, వారికి రాజ్యాంగం రూపొందించిన హక్కులను పాలకులు నీరుగారుస్తున్నారన్నారు. గృహ హింస, వరకట్న వేధింపులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకురాలు అన్నపూర్ణ, హెచ్‌ఆర్ఎఫ్ ప్రతినిధి కె.అనురాధ, బేగం, లావణ్య, నూకరాజు, రాంప్రభు పాల్గొన్నారు.

పారిశ్రామిక వ్యవస్థ అనుసంధానంతో మేలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మద్దిలపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలతో పారిశ్రామలను అనుసంధానం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు చెప్పారు. కళాశాలలో బుధవారం ఆయన విద్యాసంస్థలతో పారిశ్రామిక వ్యవస్థల అనుసంధానం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శుక్రవారం 50 పరిశ్రమలతో ఉపాధి, ఉద్యోగ, ఇంటర్న్‌షిప్ అంశాలపై చర్చా కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీ టెక్నాలజీ, సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ ఇనిస్టిట్యూట్, ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా సంస్థలు హాజరవుతున్నాయన్నారు. బ్యాంకులు, ఫార్మా, సాఫ్ట్‌వేర్, ఆయిల్ రంగ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.ఉమామహేశ్వరరావు, డి.శ్రావణ్‌కుమార్, కె.రవిబాబు, రాజేశ్వరరావు, పి.గోపాల్‌నాయుడు, జి.లక్ష్మణరావు, జి.వి.ప్రతాప్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి పరస రేపు

కంచరపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెంలో కొలువై ఉన్న కలియుగ దైవం వేంకటేశ్వర స్వామివారి పరస మహోత్సవం శనివారం జరగనుంది. స్వామివారి వార్షిక పరస మహోత్సవానికి సంబంధించిన వివరాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఉమ్మిడి వాసుదేవరావు, పట్టిమ రాజు గురువారం వెల్లడించారు. ఈ నెల 8న పరస సందర్భంగా వేకువ జామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

తుది దశకు చేరిన సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న సీనియర్ 9ఏ సైడ్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు తుది దశకు చేరాయి. గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో శ్రీధర్ ఎస్‌సి 1-0 గోల్ తేడాతో ఎస్ఆర్‌కెఎఫ్‌సి జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో మోర్నింగ్ స్టార్ ఎఫ్‌సి 3-1 గోల్స్ తేడాతో పోలమాంబ ఎఫ్‌సి (చిట్టివలస)పై నెగ్గింది. ఆసక్తికరంగా ఈ మ్యాచ్ నిర్ణీత సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు గోల్ సాధించకపోవడంతో టై బ్రేకర్స్ నిర్వహించారు. ఇందులో మోర్నింగ్ స్టార్ మూడు గోల్స్ చేయగా, పోలమాంబ ఒక గోల్‌కే పరిమితమై ఓటమి చెందింది. చివరి మ్యాచ్‌లో జీఏఆర్‌ఎంఎఫ్‌సి (వెలంపేట) 3-0 గోల్స్ తేడాతో మహ్మదీన్ స్పోర్టింగ్ క్లబ్‌పై ఘనవిజయం సాధించింది. శుక్రవారం ఉదయం సెమీఫైనల్స్, సాయంత్రం ఫైనల్స్ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఎరుకుమాంబ దేవస్థానంలో ఘనంగా అన్నసమారాధన


వడ్డిస్తున్న కార్పొరేటర్ వీరారావు బుజ్జి తదితరులు

దొండపర్తి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దొండపర్తిలో వేంచేసిన ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో మహాశివరాత్రి మారువారం మహోత్సవం సందర్భంగా గురువారం మహా అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన 27వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని వీరారావు బుజ్జి అన్న సమారాధన ప్రారంభించారు. దేవస్థానం మాజీ చైర్మన్ అల్లూరి సత్యనారాయణరెడ్డి, మాజీ ధర్మకర్తలు గురుగోవింద్, మజ్జి వెంకట సత్యనారాయణ, చిట్టిబోయిన గంగరావు, గొరుసు గురునాథ్‌రెడ్డి, అల్లూరి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

అక్కయ్యపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీసాయి ధ్యానమందిరం ఆవరణలో గురువారం మజ్జిగ చలివేంద్రాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం వాకర్స్ గ్రూప్ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాహార్తుల కోసం ఆలయ ఆవరణలో 1997 నుంచి క్రమం తప్పకుండా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, సభ్యులు పాల్గొన్నారు.

మకర తోరణం వితరణ


వినాయకుడికి అలంకరించిన మకర తోరణం వద్ద దాత కుటుంబ సభ్యులు

సీతమ్మధార, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు రేసపువానిపాలెంలో సీఎంఆర్ షాపింగ్‌మాల్ వెనుక గల వరసిద్ధి వినాయక ఆలయంలో వినాయకుడికి గ్రామ అధ్యక్షుడు గురునాథరెడ్డి మకర తోరణాన్ని వితరణ చేశారు. అతని కుటుంబ సభ్యులకు ఎస్‌బీఎం యంగ్ స్టార్స్ ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

డాబాగార్డెన్స్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో కళ్లను ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటే, చదువును సౌకర్యంగా పూర్తిచేసేందుకు ఉపయోగపడుతుందని రమాదేవి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ అన్నారు. గురువారం డాబాగార్డెన్స్ జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఇటీవల పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి కొందరికి కళ్లద్దాలు అవసరమైనట్లు గుర్తించారన్నారు. ఐసీఐసీఐ లోంబర్డ్ ఆధ్వర్యంలో వీటిని అందజేశారన్నారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.

యల్లమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు

మహారాణిపేటలో నేడు, రేపు కోలాహలమే


యల్లమ్మ తల్లి అమ్మవారు


భక్తుల దర్శనానికి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

మహారాణిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భక్తుల పాలిట కొంగు బంగారంగా పిలుచుకొనే యల్లమ్మతల్లి జాతర మహోత్సవాలు శుక్ర, శనివారాల్లో వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. నగరం మధ్యన జగదాంబ సెంటర్‌గా పిలుచుకుంటున్న ప్రాంతం ఒకప్పుడు యల్లమ్మతోట అనేవారు. 1972-73 ప్రాంతంలో జగదాంబ థియేటర్ నిర్మించాక ప్రాచుర్యంలో మార్పు వచ్చింది. నిజానికి ఈ ప్రాంతం అంతటినీ మహారాణిపేట అంటారు. ఏటా మహాశివరాత్రి అనంతరం తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రం వచ్చినప్పుడు యల్లమ్మతల్లి అమ్మవారి పండుగ నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం తొలేళ్ల ఉత్సవం, శనివారం జాతర నిర్వహిస్తారు. శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి పాతనగరంలోని పప్పులవీధి జిల్లేడుమూడి వారి వీధిలోని జొన్నాడ గురుమూర్తి ఇంటిలో ఉన్న సదకం చదును పట్టు వద్ద యల్లమ్మకు సోదరుడైన పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెడతారు. అక్కడ నుంచి బాణసంచా పేలుళ్లు, మేళతాళాలతో అమ్మవారిని యల్లమతోట వద్దకు తీసుకువస్తారు. అప్పటి నుంచి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తూ జాతర మహోత్సవాన్ని ప్రారంభిస్తారు. అర్ధరాత్రి నుంచి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనావకాశం కల్పిస్తారు. మాలధారణ భక్తులు అగ్ని గుండంలో నడక, శూలాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ జాతరకు పెద్దసంఖ్యలో భక్తులు వస్తారన్న అంచనాతో అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి పి.ఎల్.ఎన్ రాజు తెలిపారు.

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో బీజేపీ నేతల మర్యాదపూర్వక భేటీ


మంత్రి నిర్మలతో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఆయన కుమార్తె శ్యామల దీపిక


కేంద్ర మంత్రితో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు

సీతమ్మధార, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్ రాజు, ఆ పార్టీ నాయకురాలు శ్యామల దీపిక విశాఖపట్నం విమానాశ్రయంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరశురామరాజు సైతం కేంద్ర మంత్రిని కలిశారు.

'12లోగా పీఎం ఇంటర్న్‌షిప్ స్కీంకు పేరు నమోదు చేయించుకోవాలి'


సమావేశంలో మాట్లాడుతున్న సంయుక్త కమిషనర్ రామారావు

అక్కయ్యపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పీఎం ఇంటర్న్‌షిప్ స్కీం కోసం ఈ నెల 12లోగా నమోదు చేయించుకోవాలని కార్మికశాఖ సంయుక్త కమిషనర్ ఎం.రామారావు తెలిపారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మికశాఖ కార్యాలయంలో గురువారం వివిధ కార్మిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రిత్వ విభాగం ప్రకారం ప్రతి ఇంటర్న్‌కు నెలవారీగా రూ.5 వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు చెప్పారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పీఎం ఇంటర్న్‌షిప్ స్కీం నమోదు ప్రక్రియ ప్రారంభించిందని, దీనికోసం దరఖాస్తు చేయాలని ఆకాంక్షించే అభ్యర్థులు మొదటగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ స్కీంకు 21 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు అభ్యర్థులు అర్హులన్నారు.

బ్యాడ్మింటన్ చాంపియన్‌గా ఆర్ఐఎన్ఎల్


ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ స్పోర్ట్సు బోర్డు నిర్వహించిన ఇంటర్ స్టీల్ బ్యాడ్మింటన్ టోర్నీలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) విజేతగా నిలిచింది. దుర్గాపూర్ స్టీల్‌ప్లాంట్‌లో గురువారం జరిగిన ఫైనల్స్‌లో బొకారో స్టీల్‌ప్లాంట్‌పై విజయం సాధించి చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. జట్టులో సీహెచ్.శ్రీనివాసరావు, జి.హేమవరుణ్, కె.కిరణ్‌కుమార్, సీహెచ్.సంతోష్ డోరా అద్భుతంగా రాణించి జట్టును విజయపథంలో నడిపారు. జట్టు కోచ్‌గా కె.ఎం.లక్ష్మినాయుడు, మేనేజర్‌గా అప్పలరాజు ఆటగాళ్లకు విశేష సేవలందించారు. ఆర్ఐఎన్ఎల్ జట్టు వరుసగా రెండోసారి ఇంటర్ స్టీల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌గా నిలవడం విశేషం.

రైల్వే ఉద్యోగినంటూ మోసగిస్తున్న వ్యక్తి అరెస్టు


నిందితుడు సోముబాబు

కంచరపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొంతకాలంగా సోముబాబు అనే వ్యక్తి డీఆర్ఎం కార్యాలయ ఉద్యోగినని చెప్పి పలు మోసాలకు పాల్పడుతున్నాడు. లోకో పైలెట్‌నని, రైల్వే ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురిని మోసగించాడనే ఆరోపణలు ఉన్నాయి. డీఆర్ఎం కార్యాలయంలో ఏసీలు, టీవీలు తక్కువ ధరకు ఇస్తానని చెప్పి అక్కయ్యపాలెం, ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం, యలమంచిలి, దువ్వాడ తదితర ప్రాంతాల్లోని ప్రజలకు నమ్మబలుకుతున్నాడు. పలువురిని డీఆర్ఎం కార్యాలయానికి తీసుకువెళ్లి, వారిని బయట ఆపేసి వెనక తలుపు నుంచి తప్పించుకుంటున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సీసీ ఫుటేజీల ద్వారా నిందితుడ్ని గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అతడ్ని గురువారం అరెస్టు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

'శిష్టకరణాలకు నామినేటెడ్ పదవులివ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న పోలుమహంతి ఉమామహేశ్వరరావు, ప్రతినిధులు

మహారాణిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు భర్తీ చేస్తున్న నామినేటెడ్ పదవుల్లో ఉత్తరాంధ్రకు చెందిన శిష్టకరణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, బెలగాం జయబాబు విజ్ఞప్తి చేశారు. గురువారం హోటల్ దసపల్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో దాదాపు మూడున్నర లక్షల మంది శిష్టకరణాల కులస్తులు నివసిస్తున్నారని, వారు ఆర్థిక, సామాజిక, రాజకీయ వెనుకబాటుతనంతో ఉన్నారని పేర్కొన్నారు. సిసలైన ఉత్తరాంధ్ర వ్యక్తులను గుర్తించి పదవులు భర్తీ చేయాలని కోరారు. 1970 నుంచి రాష్ట్రంలో గుర్తింపు పొందిన సంస్థగా తాము ఓబీసీ సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని వివరించారు. శిష్టకరణాల సంక్షేమానికి కృషి చేస్తున్న వ్యక్తులను ప్రభుత్వం గుర్తించి కార్పొరేషన్ పదవులు ఇచ్చి సేవలు మెరుగుపరచాలని కోరారు. కులం పట్ల స్పష్టత లేని వారికి పోస్టులు కట్టబెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చే విధంగా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ప్రభుత్వాలు తోడ్పాటు అందించాలని కోరారు. తమకు కార్పొరేషన్ మంజూరు చేసి నిధులు కేటాయించాలని అభ్యర్థించారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు పీవీటీ రమణారావు, బలివాడ హరిబాబు, పావని, సన్‌మూర్తి, మంత్రి ఉమామహేశ్వరరావు, బీఆర్ఎం పాత్రో తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌పై విద్యార్థినులకు అవగాహన


స్టేషన్‌లో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులతో ఎస్ఐ దివ్యభారతి, హెడ్‌కానిస్టేబుల్ నరసింహమూర్తి

కంచరపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులకు గురువారం పోలీస్ స్టేషన్‌పై అవగాహన కల్పించారు. కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు కంచరపాలెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు. స్టేషన్‌లో సీఐ గది, ఫిర్యాదుల విభాగం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలో స్టేషన్ సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. దివ్యభారతి, హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం


మంటలను ఆర్పుతున్న దృశ్యం

కంచరపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు రెడ్డికంచరపాలెంలో ఓ పూరింటిలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. రెడ్డికంచరపాలెంలోని ఓ పూరింటిలో సీరపు అప్పలరెడ్డి, నాగరత్నం దంపతులు నివాసం ఉంటున్నారు. నాగరత్నం గ్యాస్ స్టవ్ వెలిగించి మరిచిపోవడంతో మంటలు చెలరేగి కమ్మలకు అంటుకున్నాయి. దీంతో ఇల్లు మొత్తం దగ్ధమైంది. మంటల్లో టీవీ. ఫ్రిజ్, ఇతర సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని అంచనా. స్థానికులు 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల కోసం 14న నిరసనలు

మహారాణిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు కార్మిక సంఘాల జేఏసీ అధ్యక్షుడు ఎం.జగ్గు నాయుడు తెలిపారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, శాశ్వత పరిష్కారం కోసం సొంతగనులు కేటాయించి సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని జేఏసీ పిలుపు ఇచ్చిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా విశాఖలో 14న ఉదయం 10 గంటలకు గాంధీ విగ్రహం నుంచి గురజాడ అప్పారావు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం ఏర్పాటు చేస్తామన్నారు. అదేరోజు అన్ని ప్రభుత్వరంగ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పెద్దఎత్తున కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న పూల సోయగం!


కంచరపాలెం పోలీసు స్టేషన్ ఎదుట రంగుల పూలు

మురళీనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగరానికి మణిహారంలా ఉండే జాతీయ రహదారి పూల సోయగంతో కనువిందు చేస్తోంది. ఎన్ఏడీ కొత్తరోడ్డు నుంచి మర్రిపాలెం, బిర్లా జంక్షన్, కంచరపాలెం పోలీసుస్టేషన్ పరిసరాలు దాటి అక్కయ్యపాలెం, పోర్టు క్వార్టర్సు.. ఇలా... నగర ప్రాంతాల్లో హైవే నాలుగు వరుసల దారి తీరైన పూల పెంపకంతో ఆకట్టుకుంటోంది. పొందికగా ట్రీ కటింగ్ చేస్తూ జీవీఎంసీ ఉద్యాన విభాగం నుంచి సెంటర్ డివైడర్ల మధ్య ఇంకా చివర సర్వీస్ లైన్ల వద్ద కూడా ఇనుప కంచెలు వేసి పూల మొక్కల్ని అందంగా మలుస్తున్నారు. కొన్నాళ్లుగా గాడి తప్పిన ఉద్యాన విభాగంలో ఇటీవల కదలిక రావడంతో సీజన్ పూలు బాటసారులను ఆకట్టుకుంటున్నాయి. సిగ్నల్ లైట్ల జంక్షన్ల వద్ద మరింతగా పూల సోయగం ప్రయాణికులకు కనువిందు చేస్తోంది. పలువురు సెల్ఫీలు తీసుకుంటూ మురిసిపోతున్నారు. మరికొన్ని రంగుల పూలు కూడా ఆకర్షణీయంగా ఉన్నాయి.

మైనారిటీ యువతకు జాబ్ మేళా

మహారాణిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీడాప్ ద్వారా ఈ నెల 14, 18, 28 తేదీల్లో జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యనిర్వాహక సంచాలకులు ఎస్.బేగం తెలిపారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లాలోని ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధ, జైన వర్గాలకు చెందిన యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేశారు. యువత జాబ్ మేళాలో పాల్గొని తమ అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఈ నెల 14న భీమిలి మహిళా పాలిటెక్నిక్ కాలేజీ, డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజీ, విశాఖ తూర్పులోని ఎన్‌టీఆర్ మహిళా ప్రాంగణంలో వీటిని నిర్వహిస్తారు. 18న గాజువాక ప్రభుత్వ ఐటీఐలో విశాఖలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, జిల్లా పరిషత్ జంక్షన్‌లోని నాక్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహిస్తారు. ఈ నెల 28న గాజువాక నాక్ ఇనిస్టిట్యూట్, విశాఖలోని ప్రభుత్వ మహిళా కళాశాల, విశాఖ వెస్ట్‌లో ఉన్న గవర్నమెంట్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. శిక్షణ కార్యక్రమాలకు తప్పని సరిగా హాజరుకావాలని సూచించారు. వివరాలకు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని, లేదా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, మైనారిటీ కార్పొరేషన్ అధికారిని సంప్రదించాలని కోరారు.

మేయర్‌పై అవిశ్వాసం?

... 5వ పేజీ తరువాయి

కలెక్టర్‌కు నివేదిక పంపిస్తారు. తర్వాత జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం కోసం కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేస్తారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా సభకు హాజరైన వారి వారిలో మెజారిటీ సభ్యులు చేతులెత్తితే అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు అవుతుంది. అప్పుడు మేయర్ స్థానంలో ఉన్నవారు పదవిని వీడాల్సి ఉంటుంది. ఇదే విషయమై చర్చించేందుకు కూటమి నేతలు అమరావతి వెళ్లి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లను కలిసినట్టు ప్రచారం జరుగుతోంది. బడ్జెట్ సమావేశం తర్వాత దీనికి సంబంధించిన ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉందని కూటమి నేతలు చెబుతున్నారు.

హక్కులపై మాట్లాడితే షోకాజ్ నోటీసులు!

... 5వ పేజీ తరువాయి

వరకు కోత పెట్టారని, అలాగే విద్యుత్ చార్జీలు పెంచేశారని, జీతాలు సకాలంలో ఇవ్వడం లేదని, కాంట్రాక్టు కార్మికులను నిర్దాక్షణ్యంగా తొలగిస్తున్నారని వీటిపై మాట్లాడితే సంస్థకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నామని చెబుతున్నారని, దీనిని తాము ఖండిస్తున్నామన్నారు. ప్లాంటును రక్షించుకోవడానికి, కార్మికుల హక్కుల కోసం యూనియన్ తరఫున పోరాటం చేస్తున్నామని, యాజమాన్యం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూస్తామన్నారు. షోకాజ్ నోటీసులకు బెదిరేది లేదని, ఇదే విధానంతో, కార్మికుల తరఫున గొంతు వినిపిస్తామని స్పష్టంచేశారు.

సీఎంకు వినతుల వెల్లువ

ఇంటర్వ్యూలు నిర్వహించాలని అసిస్టెంట్ ఆచార్యుల స్క్రీనింగ్ పరీక్షల అర్హత అభ్యర్థులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 24 వేల మంది పరీక్ష రాయగా, ఇంటర్వ్యూలకు 3,436 మంది అర్హత సాధించారన్నారు. రాత పరీక్షలో విజయం సాధించిన తమకు ఇంటర్వ్యూలు నిర్వహించి తగిన న్యాయం చేయాలని కోరారు. అలాగే 2020 ఫిబ్రవరిలో విపక్ష నేతగా ఉన్న తమ (చంద్రబాబునాయుడు)పై విశాఖ ఎయిర్‌పోర్టులో దాడి చేసిన వైసీపీ నేతలు, కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్టు పోలీసులు సుమోటోగా కేసు నమోదుచేసినా, ఇంతవరకూ దర్యాప్తు చేయలేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. నగరానికి చెందిన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని ఉత్తరాంధ్ర మసీదుల కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. కాగా 55వ వార్డు పరిధి రెడ్డికంచరపాలెంలో ప్రభుత్వం ఇచ్చిన 60 గజాల స్థలంలో పైఅంతస్థు నిర్మాణానికి సచివాలయ సిబ్బంది అడ్డుపడుతున్నారని, లంచం ఇవ్వాలని పదేపదే వేధిస్తున్నారని మైలపల్లి హరిబాబు అనే వ్యక్తి సీఎంకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రిని ఎంపీ ఎం.శ్రీభరత్, పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, రాష్ట్ర హౌసింగ్, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, గవర, వెలమ కార్పొరేషన్‌ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, పార్లమెంటు పార్టీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు వెల్లంకి భరత్, సర్వసిద్ధి అనంతలక్ష్మి, తోట రత్నం, ముత్యాలనాయుడు, చిన రెహమాన్, తదితరులు కలిశారు.

కొండను చెరబట్టిన భూ రాబందు

... 5వ పేజీ తరువాయి

రెవెన్యూ రికార్డుల్లో ఉన్న దయాల్‌నగర్ కొండపై జాగాను వందేసి గజాలుగా విభజించి వైసీపీ ముఖ్య నేత కుమారుడు తన సొంత ఆస్తిలా విక్రయిస్తుంటే అడ్డుకుని క్రిమినల్ కేసులు పెట్టాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కూడా అతని దందాకు అడ్డుకట్ట వేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పైగా అతను చెప్పినట్టు రెవెన్యూ, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నడుచుకుంటుండడం చూస్తే మామూళ్లు అందుతున్నాయనే భావన కలుగుతోందని స్థానికులు అంటున్నారు. దయాల్‌నగర్‌లో భూకబ్జాలు, అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన తర్వాత కూడా రెవెన్యూ శాఖ అధికారులు కదలలేదు. ఆ ప్రాంత వీఆర్ఓ మాత్రం గురువారం ఉదయం కొండపైకి వెళ్లి 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంలోని ఫొటోలు గల ఇళ్లు చూసి తిరిగి వెళ్లిపోయారు.

విమ్స్‌లో సీబీఆర్ఎన్ మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్

... 5వ పేజీ తరువాయి

చెల్లించనున్నాయి. మూడేళ్లపాటు నిర్వహణకు అవసరమైన సహకారాన్ని కేంద్రం అందిస్తుంది. అనంతరం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే ఈ సెంటర్ బాధ్యతను చూసుకోవాల్సి ఉంటుంది.

అత్యాధునిక పరికరాలతో వైద్య సేవలు

ఫార్మా, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాల్లో జరిగితే ప్రస్తుతం క్షతగాత్రులను కేజీహెచ్‌కు పంపుతున్నారు. కొన్నిసార్లు ప్రభుత్వ ఆదేశాలతో ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తున్నారు. అయితే, అత్యాధునిక పరికరాలు, నిపుణులు లేకపోవడం ఒక్కోసారి ఇబ్బందిగా మారుతుంది. అటువంటి సందర్భాల్లో ఈ సీబీఆర్ఎన్ మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్‌లో మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. అదేవిధంగా గ్యాస్ పేలుడు, కొవిడ్ తరహా వైరస్ బాధితులకు బయోలాజికల్ విభాగానికి చెందిన నిపుణులు, పరిశ్రమల్లో రేడియేషన్‌కు సంబంధించిన పదార్థాల పేలుడు జరిగినప్పుడు రేడియోలాజికల్ విభాగ సిబ్బంది సేవలు అందించనున్నారు.

పరిశ్రమలు, నేవీ, ఆర్మీ వద్ద న్యూక్లియర్ పదార్థాలు ఉంటాయి. పొరపాటున పేలుడు జరిగినా, లీక్ అయినా బాధితులకు తక్షణ వైద్య సాయం అందించేందుకు అనుగుణంగా ప్రత్యేకంగా న్యూక్లియర్ బ్లాక్‌ను ఏర్పాటుచేస్తారని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించామని, కొద్దిరోజుల్లో నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారికి కూడా మెరుగైన వైద్యసేవలను అందించవచ్చునన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

గాజువాక, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ పర్యటనకు విచ్చేసిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం విమానాశ్రయంలో కలిశారు. స్టీల్‌ప్లాంటుకు భారీ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం మంచి విషయమని, దీంతో ఉక్కు కర్మాగారం ఆర్థికంగా బలపడుతుందని కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎన్.ఎ.డి.జంక్షన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సమీపం గాంధీనగర్‌లో కాలువ నిర్మాణానికి గురువారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ట్రాక్‌కు దగ్గర ఉన్న కాలనీలో వర్షం, మురుగు నీరు పోయేందుకు వీల్లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రూ.47.65 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, స్థానిక నాయకులు సోమేశ్; దాసరి కృష్ణ, కొండలరావు, సత్యనారాయణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉక్కు బీసీ గేటు వద్ద ధర్నా

పెదగంట్యాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ ఇంటక్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో అఖిలపక్ష కాంట్రాక్ట్ లేబర్ యూనియన్లు శుక్రవారం ఉక్కు బీసీ గేటు ఎదుట ధర్నా చేయనున్నాయి. ప్లాంటులో ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో 30 శాతం మందిని తొలగించేందుకు యాజమాన్యం నిర్ణయం తీసుకోవడం దారుణమని ఇంటక్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. ఇప్పటికే కొంతమందిని తొలగించిందని, మరి కొందరిని తొలగించేందుకు చర్యలు చేపట్టడాన్ని నిరసిస్తూ ధర్నా చేస్తున్నామన్నారు.

టీడీపీ గుర్తింపు కార్డుల పంపిణీ


గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

మల్కాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 61వ వార్డు పరిధి ఎస్సీ కాలనీలో టీడీపీ సభ్యత్వాలు పొందిన వారికి గుర్తింపు కార్డులను గురువారం పార్టీ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం పొందిన ప్రతిఒక్కరికీ బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకుడు పెద్దాడ భూలోకరాజు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 14, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 44, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12, క్యారెట్ 32 దొండకాయలు 38, బంగాళదుంపలు 15, అరటికాయ (పె)6, అల్లం (పాతది)50, బరబాటి 32, మునక్కాడలు (కిలో) 56, ముల్లంగి 2, నిమ్మకాయలు (కిలో) 95, బద్దచిక్కుడు 44, దోసకాయలు 28, కొబ్బరికాయ (పెద్దది) 25, వెల్లుల్లి (పెద్దవి) 115, కీరదోస 32, బీన్స్(పెన్సిల్) 36, క్యాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 44, కంద 64, దేముడుచిక్కుడు 56, గోరుచిక్కుడు 36, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

సర్కారు స్థలం కబ్జాకు యత్నం

» నరవ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న స్థలాన్ని రెండు రోజులుగా చదును చేస్తున్న అక్రమార్కులు

» అధికారులు పట్టించుకోవడం లేదంటున్న గ్రామస్తులు


నరవలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమార్కులు చదును చేసిన దృశ్యం

గోపాలపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించడానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టక పోవడంతో సదరు స్థలంపై ఆక్రమణదారుల కన్ను పడింది. నరవ గ్రామ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టడానికి కబ్జాదారులు ప్రయత్నిస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 88వ వార్డు నరవ ప్రధాన రహదారికి ఆనుకుని సర్వే నంబర్-126లో సుమారు 17 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించి 1980లో 363 మంది బలహీన వర్గాల కుటుంబాలకు కాలనీగా కేటాయించింది. ఇందులో సామాజిక అవసరాల కోసం కొంత స్థలాన్ని విడిచిపెట్టారు. ఇందులోని కొంత భాగంలో కల్యాణ మండపం, సామాజిక భవనం నిర్మించగా.. ఇంకా సుమారు 40 సెంట్ల స్థలం ఖాళీగా ఉంది. ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఈ స్థలం దశాబ్దాల కాలంగా ఖాళీగా ఉండడంతో దీనిపై గ్రామానికి చెందిన కొందరు చోటా నేతల కన్ను పడింది. దీనిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడానికి రెండు రోజులుగా తవ్వకలు జరిపి చదును చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడానికి దర్జాగా తవ్వకాలు చేపట్టినా రెవెన్యూ అధికారులు కన్నెతైనా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని పలువురు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సర్కారు స్థలం కబ్జా కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టి, సామాజిక అవసరాల కోసం వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రాన్ని నాశనం చేసిన ఘనత జగన్‌దే

» ధ్వజమెత్తిన జనసేన కార్పొరేటర్లు


నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న జనసేన కార్పొరేటర్లు, వీర మహిళలు

సిరిపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని ఐదేళ్ల పాటు నాశనం చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జనసేన కార్పొరేటర్లు ఎద్దేశా చేశారు. ఆయన పాలనలో పడిన ఇబ్బందులతో ప్రజలు వైసీపీకి ఘోర అవమానం చేశారన్నారు. అయినప్పటికీ జగన్‌లో మార్పు కన్పించడం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై జగన్ వ్యాఖ్యలకు నిరసనగా గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ పేరు ఎత్తే కనీస అర్హత జగన్‌కు లేదన్నారు. కార్పొరేటర్ అంటే జగన్‌కు ఎంత చులకనో అర్థమవుతోందన్నారు. దీనివల్ల తన పార్టీ కార్పొరేటర్‌లకు ఏ స్థాయి గౌరవం ఇస్తారో అందరికీ తెలిసిందన్నారు. పవన్‌కు జగన్‌లా లక్ష కోట్లు అవినీతి చేయడం రాదని, చిన్నాన్నను చంపడం తెలియదని, దళితులను అవమానించిన వారికి సింహాసనం ఇవ్వడం నేర్చుకోలేదని వీటిలో జగన్ కంటే పవన్‌కల్యాణ్ తక్కువేనన్నారు. సొంత తల్లి, చెల్లిపై కేసు పెట్టిన దుర్మార్గుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సనాతన ధర్మంలోని వ్యక్తిని దూషించడం నేరమన్నారు. పవన్‌కల్యాణ్ 100 శాతం సీట్లు గెలిచిన ఘనత సొంతం చేసుకున్నారన్నారు. మారుమూల గ్రామాలకు రోడ్లు వేశారని, పంచాయతీలకు ఊపిరి పోశారన్నారు. ఇప్పటికే లెవన్ మోహన్‌రెడ్డిగా పేరు తెచ్చుకున్న జగన్ ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలని, లేదంటే జనసైనికుల తడాఖా చూపిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పీతల మూర్తియాదవ్, భీశెట్టి వసంత, దల్లి గోవింద్‌రెడ్డి, ఉషశ్రీ, కందుల నాగరాజు, వీర మహిళలు పాల్గొన్నారు.



శ్రీనగర్‌లో శ్రీకృష్ణుడిని దర్శించేందుకు ఆలయానికి తరలివచ్చిన భక్తులు

శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు

నేటి నుంచి సప్తమి వార్షికోత్సవాలు

శ్రీనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లోని శ్రీవిజయగణపతి, శ్రీరమా సత్యనారాయణస్వామి, శ్రీకృష్ణ గోవర్ధనగిరి ఆలయంలో కొలువుదీరిన శ్రీకృష్ణుడికి గురువారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆవాల సూర్యనారాయణ, కరేటి సహదేవుడు మాట్లాడుతూ శుక్రవారం నుంచి పదో తేదీ వరకు సప్తమి వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహించేందుక ఏర్పాట్లు చేశామన్నారు. ఇందులో భాగంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పంచముఖేశ్వరరావు, శ్రీనివాసరాజు, లక్ష్మణరాజు, కృష్ణ మునీంద్రరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో కుంచుమాంబ, దుర్గమాంబ ఆలయం ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ మైదానంలో కాలనీవాసులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పునర్నిర్మించిన కుంచుమాంబ, దుర్గమాంబ ఆలయాన్ని గురువారం వైభవంగా ప్రారంభించారు. మూడు రోజులుగా ప్రత్యేక యాగశాలలో హోమాలు నిర్వహించిన వేదపండితులు గురువారం ప్రత్యేక పూజలు చేసి ఆలయ శిఖర ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం అమ్మవార్ల విగ్రహాలకు వేదపండితులు పూజలు జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవార్లను దర్శించేందుకు అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, షీలానగర్, బీహెచ్‌పీవీ, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్లు గుడివాడ అనూష, పల్లా శ్రీనివాస్ లతో పాటు నాయకులు గుడివాడ లతీశ్, నూకరాజు, తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

పెనుగోకమాంబ ఆలయ వార్షికోత్సవం

గోపాలపట్నం: స్థానిక మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ సమీపం నరవ గ్రామ శివారులో కొలువుదీరిన పెనుగోకమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వేకువజామున ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధనను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గల్లా శ్రీనివాసరావు, గల్లా దేముడు, సాలాపు హరి, తదితరులు పాల్గొన్నారు.

భూలోకమాంబను దర్శించుకున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

వేపగుంట: ఇక్కడి అప్పన్నపాలెంలో ఉన్న శ్రీభూలోకమాంబను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు గురువారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతంగా ఆహ్వానించి ఆయన పేరిట ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతల విష్ణు, ప్రతినిధులు పి.అప్పలరాజు, వెంకటరావు, నూకరాజు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్పులకు అనుగుణంగా విద్యార్థులు రాణించాలి

అగనంపూడి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా విద్యార్థులు రాణించాలని పయనీర్ మార్కెటింగ్ కార్పొరేషన్ సంస్థ వ్యవస్థాపకులు నార్ల దేవార్యన్ పిలుపునిచ్చారు. దువ్వాడ విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో విగ్మాట్-2కే25 పేరిట ఏర్పాటుచేసిన జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ సదస్సుకు గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యాపార రంగంలో వస్తున్న మార్పులకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో జాతీయ స్థాయిలో సదస్సులను విజ్ఞాన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు దేవార్యన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇంద్రా హ్యూమన్ రీసోర్స్ మేనేజర్ బి.అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, ఎంబీఏ విభాగాధిపతి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ స్టీల్‌ప్లాంట్ల బ్యాడ్మింటన్‌లో 'ఉక్కు' జట్టు విజేత

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దుర్గాపూర్ స్టీల్‌ప్లాంటులో జరిగిన జాతీయ స్థాయి అంతర్ స్టీల్‌ప్లాంట్ల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖ ఉక్కు కర్మాగారం జట్టు విజేతగా నిలిచింది. జాతీయ స్థాయిలో తొమ్మిది స్టీల్ ప్లాంట్ల నుంచి క్రీడాకారులు పాల్గొనగా విశాఖ ప్లాంట్ జట్టు విజయం సాధించింది. దుర్గాపూర్ ప్లాంట్ ఈడీ మురుగేషన్ చేతుల మీదుగా ఉక్కు కర్మాగార జట్టు క్రీడాకారులు బుధవారం రాత్రి ట్రోఫీ అందుకున్నారు. సీఎండీ సక్సేనా వారిని అభినందించారు.

'8న శ్రామిక మహిళలకు సెలవు ప్రకటించాలి'

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవమైన ఈ నెల 8న శ్రామిక మహిళలకు సెలవు ప్రకటించాలని ఐద్వా ప్రతినిధులు డిమాండ్ చేశారు. టౌన్‌షిప్‌లో గురువారం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ పలు కార్యాలయాలతో పాటు కర్మాగారాల్లో మహిళలు రాణిస్తున్నారని, అటువంటి వారి కోసం ఒకరోజు సెలవు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో స్టీల్ డివిజన్ అధ్యక్షురాలు కె.వరలక్ష్మి, కార్యదర్శి కె.వేణు, తదితరులు పాల్గొన్నారు.


భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న చినజీయరుస్వామి

నేత్రపర్వంగా కల్యాణ వెంకన్న కల్యాణోత్సవం


వేపగుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని గురువారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగ సమర్పణ, అష్టోత్తర శత కలశాభిషేకం, ములవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. విద్యా ప్రాప్తి, విదేశీయానం, గృహ సంపత్తి, నవగ్రహ దోష నివారణకు హయగ్రీవ హోమం జరిపారు. మధ్యాహ్నం వందలాది మందికి అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారి తిరువీధి ఉత్సవం, కోలాటం, తిరువీధి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. జీవీఎంసీ ఏడీసీ సోమన్నారాయణ, జోన్-8 ఏఎంహెచ్‌వో బండారు అప్పలనాయుడు శ్రీవారిని దర్శించుకుని పూజలు చేశారు. రాత్రికి శ్రీవారి కల్యాణాన్ని అర్చకులు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో హైదరాబాద్ చినజీయర్ పీఠం నుంచి వచ్చిన అర్చకుల పర్యవేక్షణలో నిర్వహించారు. కాగా రాత్రి పదిన్నరప్పుడు రామానుజ చినజీయర్‌స్వామి ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. కార్యక్రమంలో ఈవో బండారు ప్రసాద్, ఆలయ సేవకులు భాను, ఆదినారాయణరావు, కృష్ణమూర్తి, వర్మ, సన్యాసిరావు, శ్రీను, శ్రీహరి, తదతరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

పెందుర్తి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ సబ్ స్టేషన్ 33/11 కేవీ రాంపురం పరిధిలో మరమ్మతు పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా రాంపురం, గండిపేట ఏరియా, వినగాడి, పెదగాడి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వేపగుంట: అప్పన్నపాలెం సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా వేపగుంట, గౌతమ్‌నగర్, సాయిమాధవ నగర్, నాయుడుతోట, పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

స్టీల్‌ప్లాంటులో కారును ఢీకొన్న ట్రక్కు


నుజ్జునుజ్జయిన కారు ముందుకు భాగం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులోని ఆర్ఎంహెచ్‌పీ జంక్షన్ వద్ద గురువారం మధ్యాహ్నం ఓ కారును డంపర్ ట్రక్కు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. అదృష్టవశాత్తు కారు నడుపుతున్న వ్యక్తికి ఎటువంటి గాయాలు కాలేదు. సీఎంఎం విభాగానికి చెందిన అధికారి కారులో కోక్ ఓవెన్ విభాగానికి వెళుతున్నారు. ఆర్ఎంహెచ్‌పీ విభాగం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఆర్ఎండీ విభాగం నుంచి వస్తున్న డంపర్ ట్రక్కు ఢీకొనడంతో కారు ముందు భాగం బాగా దెబ్బతింది.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

పెందుర్తి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పెందుర్తి శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బ్యాంక్ ఆవరణలో చేపట్టిన శిబిరాన్ని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ బిబాష్‌రంజన్‌కుంతియా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళకే బ్యాంక్ ఆర్థిక ఉన్నతికి మూలాలన్నారు. ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలతో పాటు సమాజహిత సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ దొర పర్యవేక్షణలో వైద్య బృందం రోగులకు వైద్య సేవలందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ క్యాషియర్ శ్రీహర్ష, సీనియర్ సహాయకుడు ఎస్వీ రమణమూర్తి, సిబ్బంది ఆశాచంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పతకాలు సాధించిన యువ ఉద్యోగులను ఇంటక్ నాయకులు గురువారం ప్లాంటులో అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్లాంటులో భద్రత చాలా ముఖ్యమన్నారు. విధి నిర్వహణలో ఉద్యోగులంతా చాలా జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పీవీ. రమణమూర్తి, దేముడు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

పరిహారంతో పాటు ఉపాధి కల్పించాలని రైతుల ఆందోళన

పెందుర్తి-రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నూతన రైల్వే ట్రాక్, బ్రిడ్జి నిర్మాణాల నిమిత్తం తమ నుంచి సేకరించే భూములకు సంబంధించి నష్ట పరిహారం చెల్లించడంతో పాటు రైల్వే శాఖలో ఉపాధి అవకాశం కల్పించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతల అగ్రహారం నూకాంబిక ఆలయం వద్ద గురువారం చేపట్టిన ధర్నాలో స్థానిక రైతులతో పాటు చీమలాపల్లి, పొర్లుపాలెం గ్రామాలకు చెందిన కర్షకులు పాల్గొన్నారు. భూములు కోల్పోనున్న తమకు న్యాయం చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెంటకోట వెంకటరమణ, కొణతాల సూర్యనారాయణలు మాట్లాడుతూ గిల్‌మన్ సర్వే జరగక ముందు నుంచే ఈ ప్రాంతంలో గల భూములలో రైతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ రికార్డులలో హక్కు, అనుభవదారుల జాబితాలో సాగు రైతుల పేర్లే నమోదయ్యాయని, వీటి ఆధారంగానే ప్రభుత్వం తమకు రైతు బజారు గుర్తింపు కార్డులను మంజూరు చేసిందని పేర్కొన్నారు. సింహాచలం దేవస్థానానికి చెందిన ఈ భూములపై ఎటువంటి హక్కులు లేవని, అందువల్ల పరిహారాన్ని సాగు రైతులకే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల ప్రతినిధులు కె.సత్యనారాయణ, ఎ.అప్పన్న, మహిళా రైతులు పాల్గొన్నారు.

స్టీల్ సిటీ ఐటీఐలో కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ

గాజువాక, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గాజువాక ప్రభుత్వ స్టీల్ సిటీ ఐటీఐలో స్కిల్ హబ్ ద్వారా కంప్యూటర్ కోర్సులో యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఆపై చదువుకున్న 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు గలవారు శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8121743777 సెల్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు అగనంపూడి విద్యార్థుల ప్రాజెక్టుల ఎంపిక


గిరీశ్‌కుమార్


ఆశ్లేష్‌కుమార్

అగనంపూడి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసిన ఏపీ ఇన్‌స్పైర్ అవార్డులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పెద్దాడ గిరీశ్‌కుమార్, సమ్మంగి ఆశ్లేష్‌కుమార్ రూపొందించిన ప్రాజెక్టులు ఎంపికైనట్టు హెచ్ఎం ఎం.కృష్ణారావు తెలిపారు. 9వ తరగతి చదువుతున్న గిరీశ్‌కుమార్ సన్‌లైట్ డ్రైవింగ్ మిషన్, 8వ తరగతి చదువుతున్న ఆశ్లేష్‌కుమార్ ఫెర్టిలైజర్స్ బ్లోయర్ ప్రాజెక్టులను రూపొందించినట్టు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులను ఏపీ ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికవ్వడంతో విద్యార్థులతో పాటు గైడ్ టీచర్లు కృష్ణవేణి, అరుణకుమారి, ప్రసాద్, రవికుమార్, సెహన్నాలను హెచ్ఎం అభినందించారు.

గీతంలో మహామహుల సందడి



ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, హాజరైన ఆహ్వానితులు

- ఉత్సాహంగా ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ
- చలోక్తులతో నవ్వులు పూయించిన మాజీ ఉప రాష్ట్రపతి
- ఆద్యంతం ఆసక్తిగా సాగిన సమావేశం

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం మహామహులు సందడి చేశారు. డా.దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్, మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఇప్పటివరకు మనం చదువుకున్న చరిత్రలో అసలు వాస్తవాలు లేవని, నిజమైన చరిత్రను ప్రజలకు అందించే దిశగా దగ్గుబాటి ప్రయత్నించారని నేతలు కొనియాడారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందిస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు, చిత్రంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపీలు పురందేశ్వరి, శ్రీభరత్



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడుకు ఫొటో అందజేస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు జీసీసీ కిట్ అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్

సీఎంకు వినతుల వెల్లువ



పార్టీ కార్యాలయంలోకి వెళ్తున్న సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం రాత్రి పార్టీ కార్యాలయంలో బస చేశారు. గురువారం ఉదయం పెద్దసంఖ్యలో నేతలు, ప్రజలు అక్కడికి చేరుకుని, సమస్యలపై వినతిపత్రాలను ఇచ్చారు. అన్నింటినీ సావధానంగా ఆలకించిన ముఖ్యమంత్రి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



పార్టీ కార్యాలయంలో మహిళలతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు



నజీర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని సీఎంను కోరుతున్న ముస్లిం సంఘాల నేతలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మీను (ఫైల్ ఫొటో)

మల్కాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ఈ సంఘటన బుధవారం రాత్రి మారుతి సర్కిల్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కూర్మన్నపాలేనికి చెందిన కోటా మీను భూషణం (46) దువ్వాడ సచివాలయం-1లో మహిళా పోలీసుగా పనిచేస్తున్నారు. కుమార్తెతో కలిసి బుధవారం నగరానికి వచ్చి, రాత్రి పదిగంటల సమయంలో తిరిగి వెళ్తుండగా మారుతి సర్కిల్ వద్ద ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదం ఎలా జరిగిందో స్పష్టంగా తెలియరాలేదు. ఆగి ఉన్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో మరో వాహనం ఢీకొని ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటన స్థలంలో మీను భూషణం మృతి చెందగా, వెనుక కూర్చున్న కుమార్తె గాయపడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం కేజీహెచ్‌కు తరలించి, మల్కాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె తన మాట వినలేదని తండ్రి ఆత్మహత్య

ఆరిలోవ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఫోన్ కొనాలని మారాం చేసిన కుమార్తెకు సర్దిచెప్పినా వినిపించుకోకపోవడంతో మనస్తాపం చెందిన తండ్రి పురుగుల మందుతాగి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ కృష్ణ తెలిపిన వివరాలివి... ఆరిలోవ దుర్గాబజార్‌నకు చెందిన బి.మణికంఠ (35) కుమార్తె పదోతరగతి చదువుతోంది. తనకు ఫోన్ కావాలని తండ్రిని కోరింది. ఇప్పుడు కాదు తరువాత కొంటానని చెప్పినా మాట వినకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో గత నెల 24న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన స్థానికులు అతడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ: ఒకరి మృతి

ఆరిలోవ, మార్చి6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన హనుమంతవాక కూడలిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. ఆరిలోవ ఎస్‌ఐ కృష్ణ తెలిపిన వివరాల మేరకు... చావులమదుం నుంచి ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు హనుమంతవాక కూడలికి వచ్చారు. అక్కడి వారిని ఎన్‌ఏడీ కూడలికి ఎలా వెళ్లాలో అడిగారు. యూ టర్న్ తీసుకుంటుండగా అతివేగంగా లారీ ఢీకొంది. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి రోడ్డుపై పడిపోయి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటర్ నడుపుతున్న కోటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా కోటేశ్వరరావు సుజాతనగర్‌కు చెందిన వ్యక్తి. మృతుడి వివరాలు తెలియలేదు.

గీతంలో సందడిగా ముగిసిన కెరీర్ ఫెయిర్

సాగర్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఉన్నత విద్యామండలి, నైపుణ్యాభివృద్ధి సంస్థలతో కలసి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహిస్తున్న కెరీర్ ఫెయిర్ గురువారంతో ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈకెరీర్ ఫెయిర్‌లో దాదాపు 50 కంపెనీలు యువతకు ఇంటర్వ్యూలను నిర్వహించాయి. ఫెయిర్‌లో పాల్గొనేందుకు 33 వేల మంది తమ పేర్లను నమోదు చేసుకోగా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే 20 వేల మందికిపైగా హాజరయ్యారు. మొదటిరోజు పెద్దసంఖ్యలో యువత రావడంతో రాత్రి 8 గంటల వరకు ఇంటర్వ్యూలు కొనసాగాయి. ఫలితాలను ఆయా కంపెనీలు విద్యార్థులకు వ్యక్తిగతంగా మెయిల్ ద్వారా సమాచారం పంపనున్నాయి. కాగా ఉద్యోగాలకు ఎంపికైన



నియామపక పత్రాలు అందజేస్తున్న డాక్టర్ ఉపమిత్‌సింగ్

సుమారు 600 మందికి కొన్ని కంపెనీలు నియామక పత్రాలను అందజేశాయి.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నాస్కామ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఉప్‌మిత్‌సింగ్ మాట్లాడుతూ దేశంలోని ద్వితీయ శ్రేణి పట్టణాల్లో నైపుణ్యం గల యువతకు అవకాశాలు లభించే విధంగా నాస్కామ్ కృషి చేస్తోందన్నారు. ప్రముఖ విశ్వవిద్యాలయాలతో పాటు 13 రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి పనిచేస్తున్నామన్నారు. విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలు పెంచడానికి నిర్దేశించిన ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్‌లో భాగంగా 400 కోర్సులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. విద్యార్థులు నిరంతరం సాంకేతిక మార్పులపై అవగాహన పెంచుకుని నైపుణ్య శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. కాగా కెరీర్ ఫెయిర్‌లో భాగంగా ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ అమలుచేయడానికి వీలుగా నాస్కామ్‌తో గీతం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ కార్యక్రమం లో సాంకేతిక విద్యామండలి అధికారి ఎంవీ రాధాకృష్ణ, గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ అధిపతి ఉమాదేవి, డైరెక్టర్ వంశీకృష్ణసోమయాజులు విద్యార్థులను అభినందించారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

మద్దిలపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ థియరీ జవాబుపత్రాల మూల్యాంకనాన్ని శుక్రవారం ప్రారంభించానున్నారు. ఈ మేరకు జిల్లా బోర్డు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతున్నందున మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ ఉంటుందని ఆర్‌ఐవో మురళీధర్ తెలిపారు. ఈ ప్రక్రియలో 60 మంది అధ్యాపకులు పాల్గొంటారన్నారు. ఈ నెల 20వ తేదీ తో పరీక్షలు ముగుస్తాయని, 21నుంచి పూర్తి స్థాయిలో మూల్యంకనం నిర్వహిస్తామన్నారు.

వాడపల్లికి ఆర్టీసీ వీక్లీ స్పెషల్

ద్వారకాబస్‌స్టేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుపతి వాడపల్లి వెంకటేశ్వరాలయానికి వీక్లీ స్పెషల్ సర్వీస్‌ను నడపనున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సు ప్రతి శనివారం ద్వారకా బస్‌స్టేషన్ నుంచి తెల్లవారు జామున 4 గంటలకు బయలుదేరి ఉదయం 9.30 గంటలకు వాడపల్లి చేరుకుంటుంది. అక్కడ భక్తులు ఆలయ ప్రదక్షిణలు, పూజలు, దర్శనాలు చేసుకుంటారు. ఆలయంలో ఉచిత మధ్యాహ్న భోజనం అనంతరం కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత సాయంత్రం 4 గంటలకు బయలుదేరి రాత్రి 9.30 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ బస్సుకు ఒక్కొక్కరికి టికెట్ రూ.వెయ్యిగా నిర్ణయించామన్నారు. భక్తులు ఏపీఎస్‌ఆర్టీసీఆన్‌లైన్.ఇన్‌లో టికెట్ బుక్ చేసుకోవచ్చునని, రిజర్వేషన్ కౌంటర్లు, ఆథరైజ్డు ఏజెన్సీల నుంచి టికెట్లు రిజర్వు చేసుకోవచ్చునన్నారు. వివరాల కోసం 99592 25602, 9959225594, 9052227083 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

14న అప్పన్న డోలోత్సవం

సింహాచలం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి డోలోత్సవాన్ని ఈనెల 14న నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అడివివరం గ్రామదేవత పైడితల్లమ్మ కుమార్తెను వివాహం చేసుకుంటానని కోరేందుకు స్వామివారు ఈనెల 14న కొండదిగువ గ్రామానికి తరలిరానున్నారు. ఏటా ఫాల్గుణ పౌర్ణమి రోజున ఈ ఉత్సవాన్ని డోలోత్సవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవంలో భాగంగా ఆ రోజు ఉదయం 6.30 గంటలకు స్వామివారు పల్లకిలో సింహగిరిపై నుంచి కొండదిగువకు మెట్లమార్గంలో పైడితల్లమ్మ ఆలయానికి చేరుకుంటారు. అక్కడ సోదరి కల్యాణానికి సమ్మతించిన తరువాత ప్రధాన కూడలిలోని ఉద్యాన మండపానికి చేరుకుని, డోలోత్సవం జరుపుకుంటారు. ఉత్సవంలో భాగంగా మందీ మార్బలంతో కలిసి చూర్ణోత్సవం, వసంతోత్సవాలను వేడుకగా నిర్వహిస్తారు. అనంతరం బోయీలు పల్లకి మోయగా కొండదిగువ ప్రధాన మూడు మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని జరుపుకుని, తిరిగి మెట్లమార్గంలోనే సింహగిరికి చేరుకుంటారు. డోలోత్సవం సందర్భంగా 14న అన్ని ఆర్జిత సేవలు రద్దుచేశామని, ఉత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అప్పన్న కృపకు పాత్రులు కావాలని ఈవో కోరారు.

గీతకార్మికుల మద్యం దుకాణాలకు లాటరీ



లాటరీ తీసి దుకాణాలను కేటాయిస్తున్న జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీతకార్మికులకు 14 మద్యం దుకాణాలు కేటాయింపునకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో గురువారం జేసీ మయూర్‌అశోక్ లాటరీ తీసి దుకాణాలు కేటాయించారు. శెట్టిబలిజలకు 11, యాతకు ఒకటి, గౌడలకు రెండు దుకాణాలను కేటాయించారు. 2026 సెప్టెంబరు వరకూ నిర్వహించుకునేందుకు వీలుంది. 316 దరఖాస్తులు రావడంతో అధికారులు లాటరీ తీసి కేటాయించారు. లైసెన్స్ ఫీజు కింద జీవీఎంసీ పరిధిలో ఏడాదికి రూ.42.5లక్షలు, ఆనందపురం, పద్మనాభం, భీమిలిమండలంలో రూ.32.5 లక్షలు నిర్ణయించారు. మొదటి త్రైమాసిక లైసెన్స్ ఫీజు చెల్లించడంతో ప్రొవిజన్‌లైసెన్స్‌లు జారీచేశారు. ఐడీ నంబర్లు కేటాయించాక శుక్రవారం నుంచి స్టాకు సరఫరా చేస్తారు. లాటరీలో ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీరామమూర్తి, సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్, సీఐలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆత్మీయ వీడ్కోలు



కేంద్ర మంత్రికి వీడ్కోలు పలుకుతున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగర పర్యటన ముగించుకుని తిరిగి ప్రయాణమైన కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌కు గురువారం నగర బీజేపీ నేతలు ఆత్మీయ వీడ్కోలు పలికారు. సాయంత్రం 5 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్, నేతలు బాల రాజేశ్వరరావు, కాశీరాజు, దీపిక అగర్వాల్ వీడ్కోలు పలికారు. అనంతరం ఆమె 6.20 గంటలకు విమానంలో ఢిల్లీ వెళ్లారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచితంగా ప్రాథమిక కుట్టు శిక్షణ తరగతులను నిర్వహించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్, కాపు, తదితర కార్పొరేషన్ల ద్వారా ఈనెల 8వతేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 1,846 మందికి, కమ్మ కార్పొరేషన్ ద్వారా 108 మందికి, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 319, కాపు కార్పొరేషన్ ద్వారా 363, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 304, ఆర్య వైశ్య కార్పొరేషన్ ద్వారా 131, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 353, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 172 మందికిశిక్షణ ఇస్తామన్నారు. జిల్లాకు చెందిన 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలు అర్హులని, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, సచివాలయం ద్వారా పొందిన కుల ధ్రువీకరణ పత్రం, తాజా పాస్‌పోర్టుసైజ్ ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలం 45, 60, 90 రోజులు ఉంటుందని, ప్రతి బ్యాచ్‌కు స్లాట్‌లను ఎంచుకునే అవకాశం ఉందన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి మోడల్ కుట్టుమిషన్ ఉచితంగా అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో https://apobmms. apcfss.in వారంలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఎంపీడీవో కార్యాలయం, లేదా గ్రామ సచివాలయంలోని వెల్ఫేర్ సెక్షన్‌ల ద్వారా, పట్టణ ప్రాంతంలో జీవీఎంసీ జోనల్ కార్యాలయం, వార్డు సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంవీపీ కాలనీలోని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం కార్యాలయంలో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

బెయిల్‌పై సీపీఐ నేత జేవీ సత్యనారాయణమూర్తి విడుదల



జైలు బయట మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

ఆరిలోవ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్ జీ పాలిమర్స్ కేసులో గత శుక్రవారం అరెస్టై విశాఖ కేంద్ర కారాగారంలో ఉన్న సీపీ ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన గురువారం జైలు నుంచి విడుదలయ్యారు. జైలు వద్ద సీపీఐ శ్రేణులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జేవీ మాట్లాడుతూ రీకాల్ చేసుకోలేదన్న నెపంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వారిని రిమాండుకు పంపడం కక్ష సాధింపు చర్యన్నారు. ఈ ఘటనపై పార్టీలో చర్చిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు మాట్లాడుతూ బెయిల్ తీసుకునేందుకు చాలా ఇబ్బందులకు గురిచేశారన్నారు. దొంగలు, ఇసుక, లిక్కర్ మాఫియా, భూకబ్జాకోరులు విచ్చలవిడిగా తిరుగుతున్నా పోలీసులకు కనిపించడం లేదన్నారు. పార్టీ నేతలు ఎ.విమల, కె.సత్యనారాయణ, ఆర్.శ్రీనివాసరావు తదితరులున్నారు.

వికసించిన వాండా

పెదవాల్తేరు రాణీ చంద్రమణీ దేవి ఆస్పత్రి ఆవరణలోని బయోడైవర్సిటీ పార్కులో గురువారం ఆర్కిడ్ అస్కోసెంట్రమ్ (వాండా) క్రిస్టెన్సోనియానం పువ్వు వికసించింది. ఎక్కువగా సిక్కిం రాష్ట్రంలో ఈ జాతి మొక్కలు కనిపిస్తాయి. ఏటా వేసవి ఆరంభంలో పూలు పూస్తాయి. ఈ అరుదైన పుష్పాన్ని తిలకించేందుకు పలువురు ఆసక్తి చూపారు.

- పెదవాల్తేరు, ఆంధ్రజ్యోతి



10న ఐటీఐ అప్రంటిస్ మేళా

కంచరపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ పూర్తిచేసిన వారికి ప్రధాన మంత్రి అప్రంటిస్ మేళాను ఈ నెల 10న కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, ఒకటో జోన్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ వెల్లడించారు. ప్రధాన మంత్రి నేషనల్ అప్రంటిస్ మేళా-2025లో భాగంగా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అన్ని ట్రేడుల అభ్యర్థులు మేళాకు హాజరు కావచ్చునని, మేళాలో టెక్ మహీంద్రతో పాటు 12 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు ఐటీఐలో హాజరుకావాలని వారు సూచించారు.